


'సోమశిల'కు 13,407 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి శుక్రవారం 13,407 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగింది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 72.692 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కండలేరుకు 2,000, ఉత్తర కాలువకు 40, దక్షిణ కాలువకు 150, డెల్టాకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి): గండిపాళెం జలాశయంలో నీటినిల్వ 18 అడుగులకు చేరుకుంది. పైతట్టు ప్రాంతాల నుంచి 880 క్యూసెక్కుల వరద వస్తోంది.

● రాపూరు (ఆంధ్రజ్యోతి) : కండలేరులో 54.8 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 3400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 1795 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉన్నది.

తొలిరోజున 45 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

అందిన అర్జీలు 430..

పరిష్కారం 14

గడువులోపు మిగిలినవి పరిష్కరిస్తామన్న అధికారులు

నెల్లూరులో పాల్గొన్న మంత్రి నారాయణ, కలెక్టర్

నెల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా 45 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. తొలిరోజున 430 అర్జీలు అధికారులకు అందగా, 14 అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఎక్కువగా భూ రికార్డులు తారుమారు చేశారన్న ఫిర్యాదులు అందాయి. కొన్నిచోట్ల తమ భూమిని మరొకరు ఆక్రమించుకున్నారన్న ఫిర్యాదులు కూడా వచ్చాయి. మండల స్థాయి రెవెన్యూ సిబ్బంది మొత్తం రికార్డులతో సహా ఈ సదస్సులకు హాజరయ్యారు. తహసీల్దార్‌తోపాటు మండల ప్రత్యేకాధికారులు సదస్సులో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా ఆదేశాలు ఇచ్చారు. ఈ సదస్సులను ఆర్డీవోలు పర్యవేక్షించారు. కాగా నెల్లూరులోని ఎన్టీఆర్ నగర్ ప్రాంతంలో జరిగిన సదస్సులో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఓ ఆనంద్ కూడా పాల్గొన్నారు. మనుబోలు మండల కేంద్రంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొని బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. కావలి మండలం రుద్రకోటలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

● ప్రజల ఆస్తులకు భద్రతకే సదస్సులు

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆస్తికి భద్రత, రక్షణ కల్పించడమే లక్ష్యంగా భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ అన్నారు.



మనుబోలులో రైతులనుంచి అర్జీలు తీసుకుంటున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

శుక్రవారం నగరంలోని ఎన్టీఆర్‌నగర్ వార్డు సచివాలయంలో రెవెన్యూ సదస్సును కలెక్టర్ ఆనంద్‌తో కలిసి మంత్రి ప్రారంభించి, మాట్లాడారు. సామాన్యులను భయభ్రాంతులకు గురిచేస్తూ గత ప్రభుత్వ పాలకులు వేల ఎకరాల భూములను కబ్జాచేశారని ఆరోపించారు. రెవెన్యూ శాఖలో ఉండే లోపాలను సరిదిద్ది నిజమైన అర్హుడికే న్యాయం చేసేలా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సదస్సులో వచ్చిన భూసమస్యలను నెలరోజుల్లోగా అధికారులు పరిష్కరిస్తారన్నారు. అనంతరం మంత్రి నారాయణ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వీలైనంత త్వరగా భూ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



తహసీల్దారు ఎదుట వాపోతున్న రైతులు

అధికారులు మారినప్పుడల్లా

అర్జీలంటే ఎలా!?

ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి): 'అధికారులు మారినప్పుడల్లా భూ సమస్యల పరిష్కారానికి అర్జీలు ఇవ్వమంటే ఎలా? మాది వలస ప్రాంతం. అందరూ అందుబాటులో ఉండరు.' పలువురు రైతులు అధికారుల ఎదుట వాపోయారు. శుక్రవారం మండలంలోని గన్నేపల్లి పంచాయతీ మిట్టపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో తమ భూ సమస్యల పరిష్కారానికి తహసీల్దారు సుభద్రకు రైతులు అర్జీలు అందజేశారు. సమస్యల పరిష్కారానికి గతంలో ఉన్న అధికారులకు అర్జీలు ఇవ్వగా వారు పట్టించుకోలేదని, మరలా అర్జీలు ఇవ్వాలంటే వ్యయప్రయాసాలు ఎదుర్కోవలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నెల్లూరు వెంకటస్వామి, సొసైటీ మాజీ అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్వర్లు, డీటీ హసీనా, వీఆర్వో అంజాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు. దుత్తలూరు మండలం తిమ్మాపురంలో తహసీల్దారు వై.నాగరాజు రెవెన్యూ సదస్సు నిర్వహించారు.



కోవూరులో జరుగుతున్న ఏర్పాట్లు

నేడు పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్

విద్యార్థుల భవిష్యత్‌కు ప్రభుత్వం భరోసా

రారండోయ్..
పండగ చేద్దాం!

విద్యావ్యవస్థలో అతిపెద్ద పండుగను నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసింది. జిల్లా విద్యాశాఖ అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి కార్యక్రమం విజయవంతం చేసేందుకు సంసిద్ధంగా ఉన్నారు. విద్యార్థుల వికాసం, సమస్యల పరిష్కారానికి ఈ సమావేశం మార్గనిర్దేశం చేయడంతోపాటు విద్యార్థుల, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య ఆత్మీయ వారధిగా నిలుస్తుందని అధికారులు తెలిపారు.

6

పేరెంట్స్ మీటింగ్‌కు ఆహ్వానిస్తూ పత్రిక అందజేస్తున్న విద్యార్థులు



● వర్ధంతి సభలో మంత్రి నారాయణ పిలుపు

అంబేడ్కర్ పోరాట పటిమను
స్ఫూర్తిగా తీసుకోండి!

అణగారిన వర్గాల్లో వెలుగులు నింపిన బాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా నెల్లూరులోని ఓ కల్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఆనంద్‌తో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంబేడ్కర్ పోరాటమంతా బహుజనుల రాజ్యాధికారం దిశగానే సాగిందని గుర్తు చేశారు. ఆయన ఆశయాల సాధన కోసం సీఎం చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. అంబేడ్కర్ పోరాట పటిమను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)



పోలీసుల్లాగే హోంగార్డులకూ

ప్రయోజనాలు

• వరాలు ప్రకటించిన ఎస్పీ 6

పైపై పూత...
నిధుల మేత

● రూ.6.5 కోట్లతో ఉదయగిరి రోడ్డు నిర్మాణ పనులు

● వేసిన కొద్దిరోజులకే రహదారి ఛిద్రం

ఈ రోడ్డును గమనించారా!?. ఇదేదో మారుమూల ప్రాంతంలోని రోడ్డు అనుకుంటే మీరు పొరబడ్డట్టే. ముంబయి జాతీయరహదారిలోని నందవరం నుంచి ఉదయగిరి వైపు వెళ్లే రోడ్డు ఇది. నిత్యం వాహన రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రోడ్డుపై ఇటీవల ప్యాచ్ వర్కులు చేశారు. రోజులు గడవక ముందే ఎలా దెబ్బతిన్నదో చూడండి. కాంట్రాక్టర్ కక్కుర్తి.. ఆర్‌అండ్‌బీ అధికారుల ఉదాసీనతే ఇందుకు కారణంగా తెలుస్తోంది. జిల్లా కేంద్రం నెల్లూరు నుంచి ఉదయగిరి వెళ్లాలంటే ముంబాయి హైవేలోని నందవరం నుంచి 15 కి.మీ ప్రయాణించాల్సి ఉంటుంది. నందవరం నుంచి పెద్దమాచునూరు వరకు అంటే 14 కి.మీ పొడవున రోడ్డు అధ్వానంగా ఉండటంతో మరమ్మతు చేయడానికి ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. వెంటనే ప్రభుత్వం రూ.6.5 కోట్ల నిధులు విడుదల చేసింది. ఆ వెంటనే టెండర్లు పిలవడం.. కొత్తగా రోడ్డు వేసేందుకు ఓ కాంట్రాక్టర్ పనులు దక్కించుకోవడం చకచకా జరిగిపోయాయి. మూడు నెలల క్రితం ప్రారంభమైన పనులు నత్తతో పోటీ పడేలా జరిగాయి. ఇంకా పనులు జరుగుతూనే ఉన్నాయి. అయితే, ఇప్పటిదాకా జరిగిన పనులను చూసి వాహనదారులు నివ్వెరపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుమొత్తం ధ్వంసమై గుంతలమయంగా మారిపోయింది. ఎన్నో ఏళ్లగా పరిష్కారం కాని రోడ్డు సమస్య కూటమి ప్రభుత్వంలో జరిగిందనే ఆనందం మరువక ముందే నిర్మాణంలో నాణ్యతా లోపం బయట పడటంతో ఇటు వాహనదారులు, అటు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నాణ్యతపై ఉన్నతాధికారులు పరిశీలించాలని కోరుతున్నారు. కాగా, ఈ వ్యవహారంపై ఆర్‌అండ్‌బీ అధికారులు వివరణ కోరేందుకు ప్రయత్నించగా, పొంతనలేని సమాధానం చెబుతూ తిప్పించుకోవడం గమనార్హం.

- మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి)





నందవరం-ఉదయగిరి రోడ్డుకు అటు ఇటు గుంతలే!



బండేపల్లి-డేగపూడి కాలువ పనులు (ఫైల్)

కాలువ పూర్తయ్యేనా..
నీటి కష్టాలు తీరేనా!?

● బండేపల్లి-డేగపూడి కాలువ పనులకు గ్రహణం

● మట్టి పనులు చేసి ఆపేసిన కాంట్రాక్టర్

● గత ప్రభుత్వంలో సబ్ కాంట్రాక్ట్ తీసుకున్న వైసీపీ నేత

● పనులు చేయకపోవడంతో నోటీసు ఇచ్చిన అధికారులు

● అయినా పనులు మొదలుపెట్టని వైనం

● తాజాగా సీఈకి లేఖ రాసిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

ఒకటి కాదు, రెండు కాదు.. దాదాపు మూడు దశాబ్దాల రైతుల కల బండేపల్లి-డేగపూడి కాలువ. సుమారు పది వేల మంది రైతులు, ఇరవై వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరగడంలో కీలకమైన ఈ కాలువ మనుబోలు, పొదలకూరు మండలాల రైతులకు చాలా ముఖ్యమైనది. రాజకీయ జోక్యంతో గడిచిన ఐదేళ్లు పడకేసిన కాలువ పనులకు కూటమి ప్రభుత్వంలోనైనా మొదలుపెట్టాలని రైతులు వేడుకొంటున్నారు. ఇటీవల రైతులు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకురాగా ఆయన పనులు మొదలుపెట్టించాలని చీఫ్ ఇంజనీర్‌కు లేఖ రాశారు. ఈ క్రమంలో కాంట్రాక్టర్‌కు ఇరిగేషన్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అయినా సబ్ కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తున్న వైసీపీ నేత పనులు ప్రారంభించడం లేదు.

- వివరాలు 6లో..



పర్యాటకం అభివృద్ధిపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

పర్యాటక రంగం అభివృద్ధికి
ప్రణాళికలు సిద్ధం చేయండి

నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పర్యాటక రంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో పర్యాటక, దేవదాయ, అటవీశాఖ పరిధిలోని దర్శనీయ ప్రదేశాల పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. టూరిజం అడ్వెంచర్ స్పోర్ట్స్, రోప్‌వే ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. బారాషహీద్ దర్గా, సైన్స్ మ్యూ జియం, చిల్డ్రన్స్ పార్కు, నగరవనం వంటి చారిత్రాత్మక, పర్యాటక ప్రదేశాలను విద్యార్థులంతా సందర్శించేలా చర్యలు చేపట్టాలన్నారు. భవిష్యత్ తరాలకు పర్యా టక రంగం గొప్పతనం తెలిసేలా చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రదేశాల ప్రాధాన్యతను వివరిస్తూ డాక్యుమెంట్లను తయారు చేసి సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచా రం చేయాలని సూచించారు. సోమశిల అడవిలో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఉదయగిరి దుర్గం వద్ద రోడ్ల అభివృద్ధికి మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా అవసరమైన అనుమతులు మంజూరు చేస్తామని కలెక్టర్ చెప్పారు. పురావస్తు శాఖ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీ టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, డీఎం టూరిజం శ్రీనివాస్, జిల్లా డీఎఫ్‌వో మహబూబ్‌బాషా, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, డీఈవో బాలాజీరావు, సోమశిల ఎస్ఈ వెంకటరమణారెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టుబడుతున్న
పేదోళ్ల బియ్యం!

కావలిలో 995 బస్తాల రేషన్ బియ్యం, నూకలు స్వాధీనం

కావలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యం, నూకలను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను శుక్రవారం ఉదయం కావలి ఒకటవ పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఫిరోజ్, ఎస్ఐ సుమన్‌లకు అందిన సమాచారంతో కావలి ఉత్తర శివార్లలో లారీఆఫీస్‌కు ఎదురుగా ఆగి ఉన్న మూడు లారీలను పోలీసులు గుర్తించారు. అందులో ఉన్న బియ్యానికి బిల్లులు లేకపోవటంతో వాటిని తహసీల్దారు కార్యాలయ ఆవరణకు తరలించారు. డ్రైవర్లను విచారించగా వెంగాయ గారిపాలెం రోడ్డులోని వెంకారెడ్డి రైస్‌మిల్లులో బస్తాలను లోడ్ చేశారని, లారీ ఆఫీస్ వద్దకు బిల్లులు పంపిస్తామని చెప్పడంతో లారీలను ఆపినట్లు తెలిపారు. దీంతో మూడు లారీలలోని బియ్యం, నూకలు దించేందుకు ఎంఎల్ఎస్ పాయింట్ గోదాములో ఖాళీలేక పాతురులోని సాలేహాన్ రైస్‌మిల్లుకు తరలించారు. 606 బస్తాల రేషన్ బియ్యం, 389 బస్తాల నూకలు ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేశామని, ఈ వ్యవహారంలో ఉన్న వారందరి పేర్లు కేసులో చేర్చనున్నట్లు పోలీసులు తెలిపారు.



కావలి : పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం లారీలు

● ఆధిపత్య పోరుతోనే..

రేషన్ బియ్యం అక్రమ రవాణాలో రైస్‌మిల్లుల యాజమాన్యం మధ్య ఉన్న ఆధిపత్యపోరుతోనే ఈ వ్యవహారం బయటపడినట్లు తెలుస్తోంది. ఎండీయూ వాహనదారులు, దళారులు ఎక్కువగా వెంకారెడ్డి రైస్‌మిల్లుకే విక్రయిస్తుండటంతో దీనిని మిగతా మిల్లుల వారు జీర్ణించుకోలేక పోలీసులకు సమాచారం ఇచ్చారనే ప్రచారం జోరుగా నడుస్తోంది. రెండు రోజుల క్రితం కూడా ఆ మిల్లు సమీపంలో ఓ లారీలో 36 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి.

● ఉలవపాడులో 300 బస్తాలు..

ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి) : జాతీయరహదారి మీదుగా అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యాన్ని పోలీస్, రెవెన్యూ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్సై అంకమ్మవివరాల ప్రకారం.. ఓ లారీలో రేషన్ బియ్యం ఒంగోలు వైపు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో గుణా హోటల్ సమీపంలో పోలీసులు కాపుకాశారు. మినీ లారీలో 300 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. లారీకి సెక్యూరిటీగా వస్తున్న ఓ కారును, అందులోని ముగ్గురిని, లారీని డ్రైవర్, మరో వ్యక్తిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు.

పోలీసు చొరవ

● రోడ్లపై గుంతల పూడ్చివేత



నెల్లూరు నగరంలోని రామలింగాపురం జంక్షన్‌లో, హరనాథపురం సెంటర్‌లో ప్రమాదకరంగా మారిన గుంతలను శుక్రవారం పోలీసులు పూడ్చారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పర్యవేక్షణలో స్థానిక ప్రజల సహకారంతో పోలీసు సిబ్బంది గుంతల్లో కంకర, రబ్బీస్ నింపారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ గుంతల్లో నీరు చేరి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజాగా ట్రాఫిక్ పోలీసులు గుంతలు పూడ్చడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.

- నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి)

చేప తలపై వింత ఆకృతి



గండిపాళెం జలాశయంలో మత్స్యకారుల వలకు చిక్కిన ఓ చేపపై వింత ఆకృతి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. శుక్రవారం ఉదయం డ్యాంలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు ఓ చేప లభ్యమైంది. దాని తలపై వినాయకుడి ఆకారం ఉండటంతో అంతా వింతగా చూశారు. కొంతమంది చేపను తమ మొబైళ్లలో ఫొటో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు.

- ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి)

కను విందు చేస్తున్న జలపాతం



ప్రముఖ శైవక్షేత్రమైన భైరవకోనలోని జలపాతం కను విందు చేస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు జలపాతం నుంచి నీరు ఉధృతంగా కిందకు దూకుతుండడం చూసి పర్యాటకులు పరవశించిపోతున్నారు. త్రిముఖ దుర్గాంబ భర్గులేశ్వర ఆలయ ప్రాంగణంలోకి నీరుచేరింది. దీంతో జలపాతం వద్దకు భక్తులు వెళ్లకుండా దేవస్థాన కమిటీ, ఆలయ అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు.

- సీతారామపురం (ఆంధ్రజ్యోతి)

నేడు, రేపు సీపీఎం జిల్లా మహాసభలు

నెల్లూరు (వైద్యం) డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇందుకూరుపేటలో శని, ఆదివారాలలో సీపీఎం జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ శనివారం సాయం త్రం 4గంటలకు ఎస్ఎస్ కళ్యాణ మండపం నుంచి షాదిమంజిల్ వరకు భారీ ప్రదర్శన జరుగుతుందన్నారు. అనంతరం జరిగే బహిరంగ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, జిల్లా సమగ్రాభివృద్ధిపై ఈ సభల్లో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సీపీఎం నేతలు మాదాల వెంకటేశ్వర్లు, టీవీ ప్రసాద్, సీఐటీయూ నేత అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్న ఉపాధ్యాయులు

మధుర జ్ఞాపకంగా మిగిలిపోవాలి

● 'బడిపండుగ'పై కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (విద్య), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పూర్తిస్థాయి విద్యా వాతావర ణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలకు జిల్లాలోని అన్ని పాఠశాల లు సిద్ధమయ్యాయని కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ సన్నాహాలపై జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, ఎంఈఓలతో శుక్ర వారం కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే కార్యక్రమాలన్నీ షెడ్యూల్ ప్రకారం పండుగ వాతావ రణంలో నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలల అభివృద్ధిపై పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు, విద్యా ప్రముఖులం దరినీ భాగస్వాములు చేసి పాఠశాలలకు వసతులు కల్పించేందుకు అవసరమైన విధివిధానాలపై చర్చించాలన్నారు. ఈ సమావేశా లకు కలెక్టరేట్‌లో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కంట్రోల్ రూమ్ (0861--2 331261) ఏర్పాటు చేశామన్నా రు. జిల్లాలో ఏదైనా సమస్యలుంటే వెంటనే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలన్నారు. అలాగే సమావే శాలకు సంబంధించి ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే సమావేశానికి రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నగరంలోని నవాబు పేట బీవీఎస్ నగరపాలక బాలికోన్నత పాఠశాలలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ, అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

రారండోయ్.. పండగ చేద్దాం!

● నేడు పాఠశాలల్లో మెగా పేరెంట్ - టీచర్స్ మీటింగ్

● విద్యార్థుల భవిష్యత్‌కు ప్రభుత్వం భరోసా

● అభివృద్ధికి సూచనలు, సలహాల స్వీకరణ

● తల్లిదండ్రులకు ఆటలపోటీలు.. సహపంక్తి భోజనాలు

నెల్లూరు (విద్య), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతోపాటు సహృద్భావ వాతావరణం కల్పించేందుకు, విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో శనివారం మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ జరగనుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది. ఈ కార్యక్రమ నిర్వహణ కోసం ఇప్పటికే ఐదురోజుల పాటు జిల్లావ్యాప్తంగా పలు కేంద్రాల్లో ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. పాఠశాలల్లో ఉత్తమ విద్య అందించేందుకు, అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను కలిపి ఒకే వేదికపైకి చేర్చేందుకు, విద్యాపరమైన అంశాలను చర్చించడంతోపాటు ఆటపాటలు, శుభతిథి పేరుతో సహపంక్తి భోజనాలు, పిల్లల ప్రగతి నివేదికలు అందచేయనున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో శనివారం జరగనున్న మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌లో విద్యార్థుల భవిష్యత్ ఉన్నతంగా ఉండేందుకు తీసుకోవాల్సిన నిర్ణయాలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చర్చించనున్నారు.



కల్యాణ మండపంలా రూపుదిద్దుకున్న వింజమూరులోని జడ్పీ హైస్కూలు



పొదలకూరు : తాము స్వయంగా చేసిన ఆహ్వాన పత్రాలను ప్రదర్శిస్తున్న పొదలకూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు

● 2,601 పాఠశాలల్లో నిర్వహణ

జిల్లాలోని 2,601 ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ సమావేశాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు పాఠశాల విద్యా శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. దీనికోసంగా రూ.48,67,800 నిధులను కూడా విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఆర్.బాలాజీరావు తెలిపారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ఆయా పాఠశాలలకు నిధులను కేటాయించామని, జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారన్నారు. విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం ఆహ్వాన కమిటీ, బడ్జెట్ కమిటీ, బడి సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ, రిసెప్షన్, సీటింగ్ ఏర్పాట్లు, విద్యార్థుల ప్రగతి నివేదికలు, స్టేజీ నిర్వహణ ఇలా 13 కమిటీలను ఏర్పాటు చేశామని, అన్ని పాఠశాలల్లో పండగలా కార్యక్రమ నిర్వహణ ఉంటుందన్నారు. ఆయా నియోజకవర్గాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు, పూర్వ విద్యార్థులందరూ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు.

మా స్కూల్లో మీటింగ్‌కు రండి!

'మా స్కూల్లో పేరెంట్స్ కమిటీ మీటింగ్ శనివారం జరగనుంది. మా మీటింగ్‌కు మీరు తప్పకరండి' అంటూ కోవూరులోని జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు శుక్రవారం ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులను ఆహ్వానించారు. రికార్డు షీటులపై ఆహ్వానాలను వివిధ రకాల బొమ్మలతో చిత్రీకరించి తలిదండ్రులకు అందచేశారు.

- కోవూరు, (ఆంధ్రజ్యోతి)



ఆహ్వాన పత్రాలతో విద్యార్థినులు

పోలీసుల్లాగే హోంగార్డులకూ ప్రయోజనాలు

● వరాలు ప్రకటించిన ఎస్పీ ● ఘనంగా హోంగార్డుల దినోత్సవం

నెల్లూరు (క్రైం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవంలో హోంగార్డు లకు ఎస్పీ జీ కృష్ణకాంత్ పలు వరాలు ప్రకటించారు. నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో శుక్రవారం ఈ వేడుకలు ఘనం గా నిర్వహించారు. పోలీసు వాయిద్యాల మధ్య ఎస్పీ హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేవీఆర్ పెట్రోల్ బంక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, జీ మునిరాజు, డీఎస్పీలు శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, గట్టమనేని శ్రీనివాసరావు, గిరిధర్‌రావు, ఆర్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



హోంగార్డుల ర్యాలీలో ఎస్పీ కృష్ణకాంత్, ఏఎస్పీలు తదితరులు

అనేక సౌకర్యాలు కల్పిస్తాం

పోలీసుల్లాగే హోంగార్డులు కూడా పోలీస్ క్యాంటీన్‌లో సరుకులు తీసుకునేలా, కానిస్టేబుల్ ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అయిన వారికి ఈవెంట్స్ ప్రాక్టీస్‌కు అవకాశం కల్పిస్తూ, పోలీస్ హాస్పిటల్‌లో ఉచిత వైద్యం, పిల్లలకు కళాశాలల్లో సీట్ల కేటాయింపులోనూ అవకాశం కల్పిస్తున్నట్లు ఎస్పీ ప్రకటించారు. శుక్రవారం నిర్వహించే మెన్ గ్రీవెన్స్‌ను హోంగార్డులు వినియోగించు కొని ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. హోంగార్డులకు తోడుగా ఉంటానని భరోసానిచ్చారు. వరదలు, రొట్టెల పండుగ, వినాయక చవితి, తిరుమల బ్రహ్మోత్సవాలు, విజయవాడ బ్రహ్మోత్సవాలు, వీఐపీ, వీవీఐపీ బందోబస్త్‌ను క్రమశిక్షణతో నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

కాలువ పూర్తయ్యేనా.. నీటి కష్టాలు తీరేనా!?

● బండేపల్లి-డేగపూడి కాలువ పనులకు గ్రహణం

● మట్టి పనులు చేసి ఆపేసిన కాంట్రాక్టర్

● గత ప్రభుత్వంలో సబ్ కాంట్రాక్ట్ తీసుకున్న వైసీపీ నేత

● పనులు చేయకపోవడంతో నోటీసులిచ్చిన అధికారులు

● అయినా పనులు మొదలుపెట్టని వైనం

● తాజాగా సీఈకి లేఖ రాసిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మనుబోలు, పొదలకూరు మండలాల్లోని కనుపూరు కాలువ చివరి ఆయకట్టు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పక్కనే కండలేరు కాలువ ఉన్నప్పటికీ ఆ నీటిని ఉపయోగించుకోలేని దుస్థితి రైతాంగానిది. తమకు ఇబ్బంది లేకుండా కండలేరు కాలువ నుంచి కనుపూరు కాలువకు లింకు కాలువను నిర్మించాలని ఎప్పటినుంచో ఆ ప్రాంతాల రైతులు కోరుతున్నారు. ఎట్టకేలకు 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో ఈ కాలువకు మోక్షం లభించింది. అప్పట్లో వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రూ.30 కోట్లతో బండేపల్లి-డేగపూడి కాలువ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించడంతో రైతులంతా సంతోషించారు. అనుకున్నట్లుగానే వేగంగా టెండర్లు పిలిచి 2019 ప్రారంభంలో పనులు కూడా మొదలుపెట్టారు. కొంత పనులు జరిగాక ఎన్నికలు వచ్చి వైసీపీ అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి ఈ కాలువకు మళ్లీ గ్రహణం పట్టుకుంది. ఏడాదిలో పూర్తి చేయాల్సిన కాలువను ఐదేళ్లయినా పూర్తి చేయలేకపోయారు.

అర్ధంతరంగా ఆగిన పనులు

బండేపల్లి-డేగపూడి కాలువను రూ.26 కోట్ల అంచనాతో టెండర్లు పిలవగా 11.7 శాతం లెస్‌కు కడప జిల్లాకు చెందిన ఓ సంస్థ పనులు దక్కించుకుంది. పొదలకూరు, సైదాపురం, మనుబోలు మండలాల్లో 9.27 కిలోమీటర్ల మేర కాలువను తవ్వాల్సి ఉంది. ఈ కాలువపై పలు చోట్ల స్ట్రక్చర్లు నిర్మించాలి. కొన్నిచోట్ల లైనింగ్ చేయాలి. అయితే ఇప్పటి వరకూ 5.35 కిలోమీటర్లమేర కాలువను తవ్వారు. కానీ కాంక్రీట్ పనులు మాత్రం చేయలేదు. ఇప్పటి వరకూ సుమా రు రూ.7.8 కోట్ల పనులు జరిగాయి. మొత్తం 148 ఎకరాలను భూసేకరణ చేయాల్సి ఉండగా ఇప్పటికే 94 ఎకరాలను ఇరిగేషన్ శాఖకు అప్పగించారు. మిగిలిన 54 ఎకరాల్లో 14 ఎకరాలు డీకేటీ భూములు ఉండగా మరో 40 ఎకరాలు పట్టా భూములున్నాయి. ఈ భూముల సేకరణకు సంబంధించి ఇరిగేషన్ శాఖ రిక్విజిషన్‌ను ఆర్డీవోకు పంపి ఉన్నారు. ఆ ప్రక్రియ జరుగుతోంది.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాఫీగా జరుగుతున్న పనులకు బ్రేకులు పడ్డాయి. పనులు చేస్తున్న కాంట్రాక్టర్.. రాజకీయ జోక్యంతో పనులు ఆపేశారు. చాలా కాలం పాటు పనులు చేసేందుకు ముందుకు రాలేదు. ఆ తర్వాత బండేపల్లి-డేగపూడి కాలువ పనులను పొదలకూరు మండలానికి చెందిన ఓ వైసీపీ నేత సబ్ కాంట్రాక్ట్ కింద తీసుకున్నారు. ఒక కిలోమీటరు మట్టి పనులు చేసి వదిలేశారు. ఆ తర్వాత ఈ వర్కును రివైజ్ కూడా చేశారు. అయినా కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టలేదు. ఓ వైపు రైతులు, మరోవైపు ఇరిగేషన్ అధికారులు ఎన్నిసార్లు చెప్పిన కాంట్రాక్టర్ నుంచి స్పందన లేదు. అప్పట్లో రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు కూడా నోటీసులు ఇవ్వకుండా మిన్నకుండిపోయారన్న విమర్శలున్నాయి. ఈ క్రమంలోనే గడువు ముగి యడంతో ఇటీవల ఎక్స్‌టెన్షన్(ఈవోటీ) కూడా తెచ్చుకున్నారు. అయిన ప్పటికీ పనులు ప్రారంభించలేదు. దీనిపై సమీక్షించిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పనులు మొదలుపె ట్టించి రైతాంగం ఇబ్బందులు తీర్చాలని తిరుపతి సీఈకు లేఖ రాశారు. అ తర్వాత గానీ ఇరిగేషన్ అధికారులు కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇవ్వలేదు. పోనీ ఆ తర్వాతనైనా పనులు మొదలుపెట్టారా..? అంటే ఇప్పటికీ లేదు. దీంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. కాంట్రాక్టర్ చేత పనులు చేయించడమో.. లేక రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలిచి పనులు మరొకరికి అప్పగించ డమో చేయాలని రైతులు కోరుతున్నారు.



బండేపల్లి-డేగపూడి కాలువ పనులు (ఫైల్)

సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్న మహిళలు

● ఇద్దరి నుంచి రూ.35,325 లాగేసుకున్న వైనం

లింగసముద్రం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బాలింతలు, గర్భిణుల సైబర్ నేరగాళ్ల వల విసిరారు. దీంతో మండలంలోని ఇరువురు బాలింతలు ఆ వలలో చిక్కుకున్నారు. శుక్రవారం మండలంలోని చీమలపెంట గ్రామానికి చెందిన పార్వతి అనే అంగన్ వాడీ కార్యకర్తకు సైబర్ నేరగాడు ఫోన్ చేసి తాను పెంట్రాల సచివాలయంలో ప్రభుత్వ ఉద్యోగిని అని గర్భిణులు, బాలింతలకు డబ్బులు వేస్తామని కొందరి ఫోన్ నంబర్లు కావాలని అడిగాడు. దీంతో ఆమె అదే గ్రామానికి చెందిన బాలింత బొల్లినేని అనూరాధ ఫోన్ చేయమని చెప్పింది. అలాగే ఆ నేరగాడు ఎర్రారెడ్డిపాలెంలో మరో బాలింత డబ్బుగొట్లు చం దన, అనూరాధకు ఫోన్ చేసి ఆరోగ్య శాఖ నుండి మీకు డబ్బులు వస్తాయని సెల్:78408 29695 ఫోన్ నంబరు ద్వారా వాట్సాప్ కాల్ చేసి, మీ బ్యాంకు ఖాతా నంబరు, ఓటీపీ చెప్పాలనడంతో వారు చెప్పారు. అలాగే ఆ నేరగాడు ఒక లింక్ పంపి దానిని ఓపెన్ చేస్తే డబ్బులు వస్తాయని చెప్పారని బాధిత మహిళలు చెప్పారు. అయితే ఆ లింక్ ఓపెన్ చేయగానే అనూ రాధ బ్యాంకు ఖాతా నుండి రూ.15,400లు, చందన బ్యాంకు ఖాతా నుండి రూ.19,925లు లాగేసుకున్నాడని గుర్తించారు. దీంతో వారు మోసపోయా మని గుర్తించారు. అయితే ట్రూ కాలర్‌లో ఆ నేరగాడి పేరు మిస్టర్ చౌదరి అని పడిందని చెప్పారు. అనంతరం వారు సైబర్ క్రైమ్ పోలీసులకు ఆన్‌లైన్ ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అయితే ఆరోగ్యశాఖలో పని చేసేవారే ఈ నేరాలకు పాల్పడి ఉంటారని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు

● 6 ద్విచక్ర వాహనాల స్వాధీనం

కందుకూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పొన్నలూరు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన గుంటక మాల్యాద్రి అనే మోటారు సైకిళ్ల దొంగను అరెస్టు చేసి అతని వద్ద 6ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు శుక్రవారం పట్టణ ఎస్ఐ సాంబశివయ్య తెలిపారు. పట్టణంలోని అంకమ్మ ఆలయం వద్ద పాశం నవీన్ అనే యువకుడు ఓ మెడికల్ షాపు ముందు పెట్టిన మోటారు సైకిల్ ఇటీవల అపహరణకు గురైంది. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించామన్నారు. నిందితుడు మోటారు సైకిళ్లను కందుకూరు, పొన్నలూరు, భీమవరం, హైదరాబాద్ తదితర ప్రాంతాలలో దొంగిలించినట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం మాల్యాద్రిని కోర్టుకు హాజరుపరచి రిమాండ్‌కు పంపామన్నారు.



పట్టుబడిన మోటారుసైకిళ్లు, నిందితుడితో కందుకూరు పట్టణ పోలీసులు

అక్రమ లేఅవుట్లపై చర్యలు తప్పవు: మంత్రి నారాయణ



ఓ భవన నిర్మాణానికి సంబంధించిన దరఖాస్తు పత్రాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అక్రమ లేఅవుట్లపై చర్యలు తప్పవని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి నెల్లూరులోని పలు ప్రాంతాల్లో అక్రమ లేఅవుట్లు, పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ అనుమతులను ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. నిబంధనలు పాటించని లేఅవుట్లను ఇవాళ తాను స్వయంగా పరిశీలించానని, కొండాయపాలెం దగ్గర ఓ లేఅవుట్‌లో అపార్ట్‌మెంట్ నిర్మాణానికి అనుమతులు మంజూరు కాలేదని పేర్కొన్నారు. లేఅవుట్ల నిబంధనలు చాలా వరకు సడలించినట్లు వెల్లడించారు. అక్రమ కట్టడాలన్నింటినీ కూల్చివేస్తామని మంత్రి హెచ్చరించారు. ఈ ఏడాది జూన్‌కు ముందు వరకూ ఉన్న ప్రతీ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అప్రోచ్ రోడ్డు లేకుండా పర్సనల్‌గా ఇళ్లు కట్టుకోవడం కుదరదన్నారు. ఇరిగేషన్ కాలువలపై ఉన్న నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని, అందుకు ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ శాఖలతో సంయుక్త సమావేశం నిర్వహిస్తామని నారాయణ వెల్లడించారు.

గుంత తీసారు.. నిర్మాణం మరిచారు



స్థానిక రైతు బజారు ప్రధాన ద్వారం ముందు సెప్టిక్ ట్యాంకు నిర్మాణానికి అధికారులు గుంతను తీశారు. ఇది జరిగి 20రోజులైనా నేటికీ ట్యాంకు నిర్మాణం చేపట్టకపోవడంతో రైతు బజారులోని చిరు వ్యాపారులు, వినియోగదారులు ప్రమాదాలకు గురౌతున్నారు. రోడ్డు మొత్తం గుంత తీసి వదిలేయడంతో దానిలో వర్షపునీరు నిండిపోయింది. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- కావలి, (ఆంధ్రజ్యోతి)

విద్యార్థులు కలలు సాకారం చేసుకోవాలి

- చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు
- ఎస్పీ కృష్ణకాంత్



ఎస్పీ కృష్ణకాంత్‌ను సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న వీసీ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదల, దృఢ సంకల్పంతో చదివి భవిష్యత్ కలలను సాకారం చేసుకోవాలని జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్ సూచించారు. మండలంలోని వీఎస్‌యూలో శుక్రవారం నిర్వహించిన విద్యార్థి ప్రవేశోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏ రంగంలోనైనా విజయం సాధించాలనుకుంటే చేసే పనిలో కృషి, నిబద్ధత, సమయపాలన తప్పకుండా ఉండాలన్నారు. విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవాలంటే నిరంతరం కష్టపడి చదవాలన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని, ముఖ్యంగా గంజాయి, సెల్‌ఫోన్, వాట్సప్ మొదలైనవి జీవితాన్ని ముందుకు సాగనివ్వకుండా చేస్తాయని, వాటిపట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు మాట్లాడుతూ విద్య అనేది దేశానికి, సమాజానికి అభివృద్ధిని తీసుకువస్తుందన్నారు. విద్యార్థులు సమాజానికి సేవ చేయడం కూడా బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. వీఎస్‌యూలో విద్యార్థులకు అందించిన అవకాశాలను తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం హనుమారెడ్డి, డాక్టర్ ఎస్‌బీ సాయినాథ్, డాక్టర్ మేరీ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

బిట్రగుంట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీఆర్‌పాలెం పంచాయతీ వాలిమేటి శివగౌరి (26) శుక్రవారం ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. వాలిమేటి నవీన్‌తో శివగౌరికి ఏడేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఆరేళ్ల పాప ఉంది. నవీన్ సున్నబట్టి వద్ద ప్రైవేటు ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఆమె తల్లి సుజాత సంఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించింది. ఇన్‌చార్జి ఎస్‌ఐ జంపానికుమార్ సంఘటన్నా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఈతకెళ్లి బాలుడి మృతి



మృతి చెందిన బాలుడు నోయెల్ గ్రేస్

విడవలూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పెన్నానదిలో సరదాగా ఈతకెళ్లిన బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని ముదివర్తి గ్రామంలో శుక్రవారం వెలుగు చూసింది. గ్రామస్థుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన డక్కా వందనం, కవిత దంపతుల మొదటి కుమారుడు నోయెల్ గ్రేస్(14) స్థానిక ప్రభుత్వం పాఠశాల్లో 9వ తరగతి చదువుతున్నాడు. గురువారం సాయంత్రం సరదాగా ఈతకొడదామని తన స్నేహితులతో కలసి పెన్నానదిలోనికి వెళ్లారు. ఈత కొడుతుండగా పెన్నానదికి వరద నీరు రావడంతో తోటి స్నేహితులు ఒడ్డుకి రాగ నోయెల్‌గ్రేస్ గల్లంతయ్యాడు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ నరేష్‌కుమార్‌యాదవ్ స్థానికులతో కలసి బాలుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినా బాలుడు జాడ కానరాలేదు. శుక్రవారం వేకువజామున బాలుడి మృతదేహం ఒడ్డుకి కొట్టుకుని వచ్చింది. దీంతో ఆకుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి



ఎస్.భరత్ (ఫైల్)

అల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నార్తుఆములూరు రోడ్డులో గురువారం రాత్రి 11గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక దళితవాడకు చెందిన ఇంటర్ విద్యార్థి ఎస్.భరత్ (16) మరణించాడు. తమ కుటుంబ సభ్యులు ఒకరు బస్సులో వస్తుండగా ఇంటికి తీసుకు వచ్చేందుకు ద్విచక్ర వాహనంపై పైడేరు సెంటరుకు బయలుదేరాడు. దారిలో ఎదురుగా వస్తున్న ఆటో లైట్లు కళ్లపైకి పడడంతో రోడ్డు కనపించక ఎదురుగా ఆపిఉన్న ఇటుక లోడ్ ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని రాజుపాలెంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. నార్తుఆములూరు శిగినం తిరుపతి, కళ్యాణిల ద్వితీయ కుమారుడైన భరత్ నార్తుమోపూరు శ్రీచైతన్య విద్యాసంస్థల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కుమారుడి అర్ధాంతర మృతితో తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదించారు.

ఆలయాల్లో చోరీ

ఉదయగిరి రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడినరవ గ్రామంలో పలు ఆలయాల్లో చోరీ జరిగిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గ్రామ శివారులో ఉన్న అంకాళమ్మ, శివాలయాల్లో గల హుండీలను ధ్వంసం చేసి నగదు చోరీ చేసినట్లు తెలిపారు. ఈమేరకు పోలీసులకు సైతం సమాచారం అందించామని వారు పేర్కొన్నారు.

ఇంటిదొంగలే ఇసుకాసురులు

- అధికార పార్టీ నాయకులే అక్రమాలకు తెర

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 6 : తెలుగు దేశం పార్టీలోని కొంతమంది నాయకులే ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. అర్ధరాత్రి నుంచి మినగల్లు రీచ్ నుంచి టీడీపీకి చెందిన ఓ నాయకుడి కనుసన్నల్లో టిప్పర్లతో ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. మినగల్లు మీదుగా రవాణా చేయడంతో స్థానిక ప్రజలు అడ్డుకోగా ఆ టిప్పర్లను శుక్రవారం వేకువజామున జొన్నవాడ మీదుగా పంపించారు. ఇది గమనించిన అదే పార్టీకి చెందిన నాయకులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న సదరు నాయకుడు వెంటనే అక్కడకు చేరుకుని బతిమలాడి టిప్పర్లను విడిపించుకుపోయాడు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	96
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	180
స్కిన్‌లెస్	200
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7332
వెండి కిలో ధర	రూ. 93,500
వెండి ఒక గ్రాము	రూ.96.50

మా బతుకెలా?

హైకోర్టు ఉత్తర్వులతో వైద్య ఆరోగ్యశాఖలో హెల్త్ అసిస్టెంట్ల తొలగింపుపై ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 20 ఏళ్లు కష్టపడి పనిచేసిన తమను అర్ధంతరంగా విధుల నుంచి తొలగించటం ఏమిటంటూ ఆవేదన చెందుతున్నారు. 2002, 2003, 2007 సంవత్సరాలలో డీఎస్‌ఈ ద్వారా ఉద్యోగం పొందిన తమ భవిష్యత్తును న్యాయస్థానం అంధకారంలోకి నెట్టేసిందని జిల్లాలో పనిచేస్తున్న 52 మంది హెల్త్ అసిస్టెంట్లు కన్నీరు మున్నీరవు తున్నారు.



- ఉద్యోగాల తొలగింపుతో హెల్త్ అసిస్టెంట్ల ఆందోళన
- హైకోర్టు ఉత్తర్వులతో 52 మంది తొలగింపు
- 20 ఏళ్లు కష్టపడి పనిచేశామని ఆవేదన
- 2020 తర్వాత 110 మంది నియామకం
- వారికీ ఇదే పరిస్థితా?

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నెల్లూరు జిల్లాలో 182 మంది హెల్త్ అసిస్టెంట్లుగా పని చేసేవారు. రాష్ట్ర ప్రభుత్వం 2012లో 273 జీవో విడుదల చేసింది. దీని ప్రకారం 125 మందే హెల్త్ అసిస్టెంట్లుగా పనిచేయాలని ప్రకటించింది. దీంతో మిగిలిన 57 మంది 2013లో హైకోర్టును ఆశ్రయించారు. దీనిని విచారించిన న్యాయస్థానం తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు అసిస్టెంట్లను విధుల్లో కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు వారిని విధుల్లోకి తీసుకుంటూ వైద్య ఆరోగ్యశాఖ 1207 జీవో విడుదల చేసింది. అయితే తాజాగా హైకోర్టు ఆ 57 మందిని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇప్పటికే వారిలో ఐదుగురు మృతి చెందగా మిగిలిన 52 మందిని కుటుంబ ఆరోగ్య సంక్షేమశాఖ ఆదేశాల ప్రకారం విధుల నుంచి తొలగించారు. ఇదిలా ఉంటే కొంత మంది పేర్లను అక్రమంగా 1207 జీవోలో చేర్చటంతో వారు ఉద్యోగాలు కోల్పోయారని వైద్య ఉద్యోగుల సంఘం ఆరోపిస్తోంది. దీని వెనుక అధికారులు అక్రమాలకు పాల్పడ్డారంటూ కొందరు ఉద్యోగులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వద్ద ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది.

2020 తర్వాత చేరిన వారిపైనా వేటు తప్పదా?

హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో 125 మంది హెల్త్ అసిస్టెంట్లు మాత్రమే ఉండాలి. అయితే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు 2020, 2021, 2022, 2024లో కొత్తగా 110 మంది హెల్త్ అసిస్టెంట్లను తీసుకున్నారు. భారీగా నగదు వసూలు చేసి ఈ నియామకాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే హైకోర్టు తాజా ఉత్తర్వుల ప్రకారం వీరంద రూ కూడా ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని సమాచారం. ఉన్నతాధికారులు కూడా ఇదే చెబుతుండటం గమనార్హం.

ఏమి చెయ్యాలో అర్థం కావటం లేదు



2002 నుంచి హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాం, దొరవారిసత్రం, కోవూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నాం. 20 ఏళ్లకు పైగా ఉద్యోగాలు చేస్తున్నాం. ఇప్పుడు హైకోర్టు ఉత్తర్వులతో ఉద్యోగాలు కోల్పోవలసి వచ్చింది. ఇది అన్యాయం. ఇకపై ఏమి చేయాలో, మా కుటుంబాలు ఎలా బ్రతకాలో అర్థం కావటం లేదు.

- సుధాకర్, స్టీఫెన్‌కుమార్ (హెల్త్ అసిస్టెంట్లు)

వయసు కూడా అయిపోయింది



నాకు 54 ఏళ్లు. ప్రస్తుతం ఇసుకపల్లి పీహెచ్‌సీలో పనిచేస్తున్నాను. ఉద్యోగం నుంచి తొలగించమని కోర్టు ఉత్తర్వులిస్తుందని ఊహించలేదు. ఈ వయసులో మరో ఉద్యోగమూ వెతుక్కోలేను. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఉద్యోగ నియామక ప్రకటన ఇచ్చి మాకు వెయిటేజీ ప్రకటించాలి. లేదంటే కుటుంబం ఆర్థిక కష్టాలను ఎదుర్కోవలసి వస్తుంది.

- వెంకటరమణ (హెల్త్ అసిస్టెంట్)

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- రాష్ట్ర మంత్రి లోకేష్‌కు వినతి



రాష్ట్ర మంత్రి లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

ముత్తుకూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ ఉద్యోగులు, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు చిట్టిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరీష్ మొలతాటి, తదితరులు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు. ఈమేరకు శుక్రవారం ఉండవల్లిలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. పీఆర్సీ, డీఏ, సరెండర్ లీవ్, తదితర అంశాల గురించి వివరించారు. వీఆర్‌ఏలకు వీఆర్‌వోలుగా పదోన్నతులు కల్పించేందుకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. తహసీల్దారు కార్యాలయాలు శిథిలావస్థలో ఉన్నాయని, గ్రామ సచివాలయ భవనాలు మండల కేంద్రాల్లో ఉన్న వాటిలో ఒక అంతస్తును మంజూరు చేయాలని కోరారు. 3నెలల నుంచి జీతాలు రాకపోవడంతో రీసర్వే డీటీలు ఇబ్బందులు పడుతున్నారని తెలపగా, ఈ విషయం తన దృష్టిలో ఉందని, కొద్దిరోజుల్లో అందుకు సంబంధించిన ఉత్తర్వులు వస్తాయని తెలిపారన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణా రాష్ట్రానికి 1800 మంది, అక్కడ ఉంచి ఇక్కడకు 1300 మంది అంతరాష్ట్ర బదిలీల కోసం దాఖలు చేసుకున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యపై రాష్ట్ర విభజన కమిటీ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మీచైతన్య, ప్రతినిధులు పాల్గొన్నారు.

సిగ్నల్స్ త్వరగా ఏర్పాటు చేయండి

- రోడ్డు భద్రత చర్యలు సకాలంలో చేపట్టాలి
- రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆనంద్



మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(క్రైం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగ రంలో సిగ్నల్ పాయింట్లను త్వరగా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను కలె క్టర్ ఆనంద్ ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అవసరమైన రోడ్డు భద్రత చర్యలు సకాలంలో చేపట్టాలని సూచించారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని తిక్కన భవన్‌లో శుక్రవారం రోడ్డు భద్రత కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలను డీటీసీ చందర్ వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తప్పకుండా అమలు చేయాలని, తరువాతి సమావేశానికి యాక్షన్ టేకన్ రిపోర్టుతో హాజరు కావాలని అధికారులను ఆదేశించారు. గొలగమూడి జంక్షన్ వద్ద లైటింగ్ మరింతగా పెంచాలని, జాతీయ రహదారిపై పశువులు సంచరించకుండా చూడాలని, పశువులకు రేడియం స్టిక్కర్లు అంటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు క్షతగ్రాతులను కాపాడిన వారికి గుడ్ సమ్మరిటన్ అవార్డులు అందించాల న్నారు. నగరంలో ప్రైవేటు వాహనాల నిలుపుదలకు పార్కింగ్ ప్రదేశాలను త్వరగా ఎంపిక చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ డీజీఎం గోవర్ధన్, పీడీ ఎంకే చౌదరి, ఏఎస్పీ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ ఓబులేసు నందన్, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్ కుమార్, డీఎంహెచ్‌వో పెంచలయ్య, ఆర్‌అండ్‌బీ ఈఈ మురళీకృష్ణ, డీపీవో శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కృష్ణా జిల్లా ధాన్యం సేకరించండి: : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా నుంచి వరి ధాన్యాన్ని సేకరించి నెల్లూరు జిల్లాకు తరలించాలని కలెక్టర్ ఆనంద్ రైస్ మిల్లర్ల అసోసియేషన్ నాయకులను కోరారు. శుక్రవారం ఆయన చాంబర్‌లో మిల్లర్ల అసోసియేషన్ నాయకులతో సమావేశమయ్యారు. పౌర సరఫరాల శాఖ రాష్ట్ర కమిషనర్ కృష్ణ జిల్లా నుంచి ధాన్యాన్ని సేకరించి నెల్లూరుకు తరలించాలని కోరారన్నారు. జిల్లాలోని మిల్లర్లు వారి వాహనాలను, హమాలీలను గన్నీ బ్యాగులతో సహా కృష్ణ జిల్లాకు పంపాలన్నారు. ఈ సందర్భంగా మిల్లర్లు కొన్ని సందేహాలను వెలిబుచ్చగా కలెక్టర్ వాటిని నివృత్తి చేశారు. ఈ సమావేశంలో డీఎస్వో డీవీ రమణ, మిల్లర్ల అసోసియేషన్‌కు చెందిన సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి పోస్టుల భర్తీకి చర్యలు

- జడ్పీ సీఈవో విద్యారమ



కార్యాలయాన్ని సందర్శించిన జడ్పీ సీఈవో

రాపూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఖాళీగా ఉన్న పంచాయతీ కార్యదర్శి పోస్టులను రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా భర్తీచేసేందుకు చర్యలు తీసుకుంటామని జడ్పీ సీఈవో విద్యారమ తెలిపారు. రాపూరు మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. మండలంలో జరుగుతున్న సర్వే వివరాలను పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంఎస్‌ఎంఈ, మిస్సింగ్ సిటిజన్ సర్వేలో రాపూరు మండలం వెనుకంజలో ఉందన్నారు. దాన్ని రెట్టింపు చేసేందుకు పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా పని చేయాలన్నారు. అలాగే మండలంలో హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వే బాగుందన్నారు. మండలంలో పంచాయతీ కార్యదర్శుల కొరత ఉందని, రెండు పంచాయతీలు ఒక్కరు చూస్తున్నారని ఆమె తెలిపారు. పెంచలకోన నర్సింహస్వామి ఆశీస్సులతో మండలాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం భవానీ, సీనియర్ సహాయకులు పిల్లకదుపు చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా

కావలి సబ్‌రిజిస్ట్రార్ పోస్టు

కావలి, (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ రిజిస్ట్రార్ పోస్టు వివాదస్పదంగా మారింది, సబ్‌రిజిస్ట్రార్‌గా రెండు నెలల కిందట సుమలతారెడ్డి బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. దీంతో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి దానిపై కొంత అసంతృప్తిగా ఉండటానికి తోడు స్థానిక నాయకులు ఆమెపై కొన్ని ఫిర్యాదులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీజీకి కూడా ఆమెపై వస్తున్న ఆరోపణలు తెలుపుతూ ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో ఆమె గత నెల 5 నుంచి ఈ నెల 5వ తేదీ వరకు దీర్ఘకాలిక సెలవు పెట్టారు. దీంతో సబ్‌రిజిస్ట్రార్ ఇక రారని అనేక మంది కావలి కోసం ప్రయత్నాలు చేసుకున్నారు. ఈ ప్రయత్నాలలో భారీగా ఉన్నతాధికారులకు ముడుపులు ముట్టాయనే ప్రచారం జరిగింది. దీంతో డీజీ కార్యాలయంలో కావలి పోస్ట్‌పై పెద్ద చర్చ జరిగినట్లు తెలిసింది. చివరకు మరలా సెలవుపై వెళ్లిన సుమలతా రెడ్డి వివిధ మార్గాలలో ప్రయత్నాలు చేసుకుని తిరిగి శుక్రవారం విధులలో జాయిన్ కావటంతో అసలు డీజీ కార్యాలయంలో ఏం జరుగుతోందనే ప్రచారం చర్చనీయాంశమైంది. తిరిగి జాయిన్ అయిన సబ్ రిజిస్ట్రార్‌గా కొనసాగేందుకు ఎమ్మెల్యే సమ్మతి స్తాడా లేక మరలా వ్యతిరేకించి ఉన్నతాధికా రులకు ఫిర్యాదు చేస్తాడా అనే చర్చ జోరుగా కొనసాగుతోంది.

స్కానింగ్ కేంద్రాల తనిఖీ

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నెల్లూరులోని స్కానింగ్ కేంద్రా లను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, జిల్లా మాస్‌మీడియా అధికారి కనకరత్నం తదితరులు జీజీహెచ్ స్కానింగ్ సెంటర్‌తోపాటు కిమ్స్ ఆసుపత్రి, ఐశ్వర్య ఫెర్టిలిటీ ఆసుపత్రి, అమృత చెస్ట్ ఆసుపత్రిలో తనిఖీలు జరిపారు. రికార్డులను పరిశీలించారు. ఖాదర్‌వలి మాట్లాడుతూ లింగ నిర్ధార ణ పరీక్షలు చేయరాదని నిర్వాహకులను హెచ్చరించారు. ఎవరైనా నిబంధల ను అతిక్రమిస్తే గర్భస్థ లింగనిర్ధారణ నిషేద చట్టం ప్రకారం చర్యలు తప్పవ ని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తనిఖీ బృందం సభ్యులు శ్రీనివాసరావు, కుసుమ కుమారి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ పుణ్యమే.. సమానత్వం

● అంబేడ్కర్‌కు ఘన నివాళులర్పించిన నాయకులు

అల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సమాజంలో అందరితో పాటు సమానంగా జీవించడం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చేసిన పుణ్యమే అని టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని కూటమి నాయకుల ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బండి శ్రీని వాసులు రెడ్డి, కృష్ణచైతన్య, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, మేడా శ్రీనివాసులు రెడ్డి, తిరువీధి అనూరాధ, పరంధామిరెడ్డి, కావలి జగన్, జనసేన మండలాధ్యక్షుడు కార్తీక్ శర్మ, ఇస్మాయిన్, నజీర్‌బాషా పాల్గొన్నారు. అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నరేంద్ర, పంగులూరు సుధాకర్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

● కావలి: పట్టణ టీడీపీ ఆధ్వర్యంలో ముసునూరు పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డితో పాటు నాయకులు పాల్గొన్నారు. అనంతరం టీడీపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ట్రంకు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు గుత్తికొండ క్రిషోర్, జ్యోతి బాబూరావు, యేగూరి చంద్రశేఖర్, మొగిలి కల్లయ్య పాల్గొన్నారు. అలాగే ముసునూరు వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నేతలతో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి నారా యణ, గ్రంధం ప్రసన్నాంజనేయులు పాల్గొన్నారు. బీసీపీ ఆధ్వ ర్యంలో జరిగిన కార్యక్రమంలో సీపీసీ సత్యం, అమరా వెంకటసుబ్బారావు, మందా కిరణ్ పాల్గొన్నారు. జనసేన ఆధ్వర్యంలో సమ్మన వెంకటసుబ్బయ్య పులువురు నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆర్డీవో కా ర్యాలయంలో ఆర్డీవో వంశీక్రిష్ణతో పాటు పరిపాలనాధికారి సూర్యానారాయణ సింగ్, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

● లింగసముద్రం : స్థానిక ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీడీఓ శ్రీనివాసులు, సర్పంచు పులి రాఘవులు, ఇతర టీడీపీ నేతలు పూల మాల వేసి నివాళి అర్పించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ప్రభావతి, ప్రసాద్, చిన కొం డయ్య, సీహెచ్ బాలకోటయ్య, గురునాథం, మాలకొండయ్య, మాజీ ఎంపీపీ బాలకోటయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● ఉలవపాడు: మండలకేంద్రం, కరేడు, కొల్లూ రుపాడు, ఆత్మకూరు, చాకిచర్ల, చాగొల్లు, వీరేపల్లి, భీమవరంలో అంబేడ్కర్ అసోసియేషన్ సభ్యులు నివాళుల ర్పించారు.

● బిట్రగుంట: స్థానిక బజారులోని జరిగిన కార్య క్రమంలో దళిత నేతలు, ఉద్యోగులు నివాళులర్పించారు. వైద్యులు కొర్రా చంద్రశేఖర్, ఉద్యోగులు గంగాధర్, వెంకటేశ్వర్లు, పెంచలయ్యతో పాటు ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దాసరి సునీల్ ఉన్నారు. దళిత నేతలు శెట్టిపల్లి మల్లి, బత్తుల రవిచంద్ర, బుర్రి వెంకటరావు వేర్వేరుగా చోట్ల నివాళులర్పించారు.

● జలదంకి: బ్రాహ్మణక్రాకలో అంబేడ్కర్ యూత్ సభ్యులు, వీఆర్వో మణికంఠ, యూత్‌సభ్యులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

● కందుకూరు: స్థానిక అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో ఏపీడీ అసోసియేషన్ సభ్యులు నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు చనమాల కోటేశ్వరరావు, గేరా చిరంజీవి, గాంఢ్ల హరిప్రసాద్, గేరా మనోహర్, రేణమాల అయ్యన్న, ముప్పవరపు కిషోర్, శీలం సుధీర్, వైసీపీ నాయకుడు రావులకొల్లు బ్రహ్మానందం పాల్గొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, రాయపాటి శ్రీనివాసరావు, చదలవాడ కొండయ్య, రెబ్బవరపు మాల్యాద్రి, చిలకపాటి మధుబాబు, ముచ్చు శ్రీనివాసరావు, షేక్ రఫీ, కూనం నరేంద్ర, బెజవాడ ప్రసాదు, చుండూరి శ్రీనివాసరావు, నత్తా తిరుమలరావు పాల్గొన్నారు. వైసీపీ కార్యాలయంలోను పార్టీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ పాల్గొన్నారు.

● ఆత్మకూరు:కరటంపాడులో సర్పంచ్ రేవతి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సెర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ వాగాల శ్రీహరి, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● సంగం :బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కృష్ణ తహసీల్దారు కార్యాలయం వద్ద ఉన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ నరసయ్య, పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

● కలువాయి : అంబేడ్కర్ ధర్మపోరాట సమితి సభ్యులు బస్టాండు సెంటర్ నిర్వహించిన కార్యక్రమంలో ఏడీపీయస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిజమాల ప్రసాద్, గొల్లపల్లి నరసయ్య, ఏఎస్ఐ రమణయ్య, రిటైర్డ్ టీచర్ వజ్రాల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

● ఉదయగిరి రూరల్: స్థానిక అంబేడ్కర్ భవన్ ఆవరణలోని విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు జాషువా, బాలగురవయ్య, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అసోసియేట్ డీన్ కృష్ణారెడ్డి, అల్లూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంధ్ర విద్యార్థి సంఘం నాయకులు శంకర్‌లు నివాళులర్పించారు.

● దుత్తలూరు: స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి తహసీల్దారు నాగరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● వింజమూరు : మండల కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన అంబేడ్కర్ వర్ధంతి నిర్వ హించారు. నందిగుంటలో సెక్రటరీ, సిబ్బంది నివాళులర్పించారు.

● అనంతసాగరం: సోమశిల, అనంతసాగరం రాజు కాలనీలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అన్వర్‌బాష, గాడి సుధాకర్, చిన్నయ్య, చంద్రశేఖర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు: పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్ననాయకులు



కావలి: ట్రంకు రోడ్డులో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, నేతలు

అప్రమత్తంగా ఉండండి

● ఒంగోలు ఇరిగేషన్ ఎస్‌ఈ వరలక్ష్మి

లింగసముద్రం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు ఎగువ భాగాన వర్షాలు కురిసి ప్రాజెక్టులోకి నీటి ప్రవాహం వస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఒంగోలు ఇరిగేషన్ ఎస్‌ఈ వరలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఎస్‌ఈ రాళ్లపాడును సందర్శించి ప్రాజెక్టులోని నీటిమట్టాన్ని పరిశీలించారు. అలాగే ప్రాజెక్టులోకి ఎంత మేరకు నీటి ప్రవాహం వస్తుందనే వివరాలు డీఈ వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. నీరు దిగువకు విడుదల సమయంలో మన్నేరు పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. ఇన్‌ఫ్లోను బట్టి అవుట్‌ఫ్లోను వదలాలన్నారు. అనంతరం ప్రాజెక్టు పాత, కొత్త స్పిల్‌వే గేట్లను పరిశీలించి వాటి పనితీరు గురించి అడిగారు. కార్యక్రమంలో మరో డీఈ మధుసూదనరావు, ఏఈలు చంద్రమౌళి, నవీన్ పాల్గొన్నారు.

దివ్య జ్యోతుల ఊరేగింపు

ఉలవపాడు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 6: స్థానిక కనకదుర్గమ్మ దివ్యజ్యోతుల ఊరేగింపు శుక్రవారం రాత్రి పురవీధుల్లో వైభవంగా జరిగింది. భవాని మాలధారులు, అమ్మవారి భక్తులు పాత రైల్వేరోడ్డులోని విఘ్నేశ్వరుని గుడి నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి 10గంటలకు అయ్య ప్ప, భవాని, గోవింద, శివయ్య మాలధార స్వాములు ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన అగ్నిగుండం ప్రవేశం చేశారు.

బైక్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

కావలి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మోటారు బైక్ ఢీ కొని చలంచర్ల సలేంద్రయ్య తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం రాత్రి పట్టణ సమీపంలోని పెద్దపవని రోడ్డులో జరిగింది. వివరాల మేరకు.. లింగసముద్రం మండలం ముత్తం వారి పాలెంకు చెందిన ఈయన పట్టణ వైద్యశాలలోని బంధువులను పరామర్శించేందుకు వచ్చాడు. స్వగ్రామానికి తిరిగి వెళ్లేందుకు ఉదయగిరి రోడ్డులో నుండి పెద్దపవని రోడ్డులోని వైకుంఠపురం వైపుకు నడుచుకుంటూ వెళుతుండగా వెనుక వైపున నుంచి పల్సర్ బైక్ వచ్చి ఢీ కొంది. దీంతో తీవ్రంగా గాయపడిన సలేంద్రయ్యను 108 వాహనంలో ఏరియా వైద్యశాలకు తరలించారు. మోటారు బైక్ నడుపుతున్న యువకుడు వాహనాన్ని సంఘటనా స్థలంలో వదిలి వెళ్లిపోయాడు.

ప్రతిభా విద్యార్థికి ప్రోత్సాహకం

బిట్రగుంట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీ య స్థాయి రెస్లింగ్ పోటీలకు ఎంపికైన కప్పరాళతిప్ప అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని దర్శి శ్రీలతకు శుక్రవారం యూనియన్ సభ్యులు నగదు అందజేశారు. కార్యక్రమంలో నెల్లూరు ఏపీఈఆర్‌యూ జిల్లా అధ్యక్షులు డోలా శ్రీహరిప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లు రాజేంద్రప్రసాద్, జైభీం బత్తుల రవిచంద్ర, లేళ్ళపల్లి వేణు, కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ పద్మావతి, ఉపాధ్యాయులు అనురాధ, అలివేలుమంగతాయారు, పీఈటీ సులోచన, అలినిషా తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రుల సమావేశాలకు సర్వంసిద్ధం

వింజమూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):స్థానిక జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శ నివారం జరిగే పేరెంట్స్ మీటింగ్‌కు ముస్తాబైంది. మామిడి తోరణాలు అరటి పిలకలతో అలంకరించారు. ప్రధానోపాధ్యాయులు మాలకొండయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలో పండుగ వాతారణం కల్పించే విధంగా ముస్తాబు చేశామని తెలిపారు.

● కలిగిరి: స్థానిక ఏపీ మోడల్‌స్కూల్, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం భీమేశ్వరరావు తెలిపారు. తల్లిదండ్రులందరూ విద్యార్థులతో కలిసి తరగతిగదిలో కూర్చోవడం, తల్లిదండ్రులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించడం, విద్యార్థుల ప్రగతిని వారికి తెలియజేస్తామన్నారు. పూర్వ విద్యార్థుల విజయ గాథలు, సైబర్‌నేరాలపై అవగాహన, పాఠశాల ప్రగతి నివేదిక అంశాలను చర్చిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న సహపంక్తిభోజనం ఉంటుందన్నారు.

● కొండాపురం: మండలంలోని 65పాఠశాలలను కలిసి మెగా పేరంట్స్ డే కార్యక్రమంను శనివారం నిర్వహించనున్నట్లు ఎంఈవో-1 కె.రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఇప్పటికే ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు విద్యార్థుల తల్లిదండ్రులు, యాజమాన్య కమిటీలు, స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందజేసినట్లు చెప్పారు.

ముగిసిన రైల్వే ట్రేడ్ యూనియన్ ఎన్నికలు

బిట్రగుంట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే సెక్షన్ పరిధిలో మూడు రోజులుగా జరుగుతున్న రైల్వే ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికలు శుక్రవారంతో ముగిశాయి. మజ్దూర్ యూనియన్ బిట్రగుంట బ్రాంచ్ అధ్యక్షుడు మద్దిబోయిన శేఖర్‌యాదవ్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, మహేష్, శ్రీహరి ఒకవైపు.. ఎంప్లాయీస్ సంఘ్ కార్యదర్శి తిరుమలశెట్టి రాజశేఖర్, కోశాధికారి కిరణ్‌కుమార్, వరప్రసాద్‌లు మరోవైపు జోరుగా ఓట్ల సాధనకు కృషి చేశారు. 849 మంది వివిధ శాఖలో రైల్వే కార్మికులు ఉండగా 722 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు.

మాదాలకు ఘన నివాళులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మాదాల జానకిరాం వర్ధంతి వేడుకలను శుక్రవారం నెల్లూరులోని ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరులోని ప్రగతి చారిటబుల్ సంస్థలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాదాల బంధుమిత్రులు, స్నేహితులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సీతారామపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పొంగిపొర్లుతున్న వాగులు వంకలు దాటకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కృష్ణారెడ్డి తెలిపారు. బాలాయపల్లి గ్రామ పంచాయతీలోని రంగనాయుడుపల్లి వాగును శుక్రవారం ఎరిశీలించారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

ఏఎస్ పేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆత్మకూరు డిఎస్‌పి వేణుగోపాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంగం సిఐ వేమారెడ్డి, ఏఎస్‌పేట ఎస్‌ఐ సైదులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కాకర్ల పర్యటన

ఉదయగిరి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో శనివారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పర్యటించనున్నట్లు ఆయా మండలాల టీడీపీ కన్వీనర్లు చింతనబోయిన బయ్యన్న, పేలపూడి వెంకటరత్నం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలుత ఉదయగిరి మండలం గండిపాళెం గ్రామంలోని గురుకుల పాఠశాలలో నిర్వహించే పేరెంట్స్, టీచర్స్ మీటింగ్, రెవెన్యూ సదస్సులో పాల్గొంటారన్నారు. అలాగే దుత్తలూరు ఆదర్శ పాఠశాలలో నిర్వహించే పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు హాజరవుతారన్నారు. ఆయా మండలాల్లోని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

యంత్ర సామగ్రి అందుబాటులో ఉంచాలి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి మార్కెట్ యార్డు పరిధిలోని పసుపు రైతుల సౌకర్యార్థం అవసరమైన యంత్ర సామాగ్రిని అందుబాటులో ఉంచాలని రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పసుపు రైతులు మార్కెట్ కమిటీ కార్యదర్శి ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ పసుపు ఉడక బెట్టేందుకు బాయిలర్స్, పాలీష్ మిషన్‌లు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ యంత్రాలను ప్రస్తుతం రైతులు కడప, కృష్ణా జిల్లాల నుంచి అద్దెకు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఆయా యంత్రాలను ఏర్పాటుచేస్తే రైతులకు ఇబ్బందులు తొలుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

అఖిలపక్ష సదస్సును జయప్రదం చేయండి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వెలుగొండ ప్రాజెక్టు సాధన, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఆదివారం కడప పట్టణంలో నిర్వహించే అఖిలపక్ష సదస్సును జయప్రదం చేయాలని వెలుగొండ సాధనసమితి నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని ఏరుకొల్లు గ్రామంలో సదస్సుకు సంబంధించి కరపత్రాలు ఆవిష్కరించారు.

అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 15వ తేదీన పౌర్ణమి సందర్భంగా ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి భక్తుల సౌకర్యార్థం అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బస్సు 14న ఉదయం 8 గంటలకు ఉదయగిరిలో బయలుదేరుతుందన్నారు. రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందన్నారు. ఒక్కొక్కరికి రానుపోనూ రూ.1,650లు చార్జీ నిర్ణయించామన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లక్కీడ్రా విజేతలకు బహుమతులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఆర్టీసీ డిపో పరిధిలోని సీతారామపురం మార్గంలో ఏర్పాటు చేసిన గిఫ్టుబాక్సు లక్కీడ్రాలో విజేతలకు శుక్రవారం డిపో మేనేజర్ శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను ఆర్టీసీకి మరింత చేరువ చేసేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఐ నాగభూషణం, ఏడీసీ వెంకటేశ్వర్లు, కార్మికులు పాల్గొన్నారు.



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సిబ్బంది రక్తదానం

కావలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో విద్యార్థులను మినహాయిస్తే రక్తదానం చేయటంలో బ్యాంకులు, ఎల్‌ఐసీ ఉద్యోగులు అగ్రస్థానంలో ఉన్నారని కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి సిబ్బందిని అభినందించారు. బ్యాంకు మేనేజరు ఏ లక్ష్మీనారాయణ, పీ. ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో పలువురు సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు ఎస్‌కే అమన్సీ, ఎం. దిలీప్, జే.మనోహర్, పీహెచ్ ఫణికుమార్, కే. సాయికుమార్ పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన మాజీఎమ్మెల్యే

కందుకూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రి నారా లోకేష్‌బాబును శుక్రవారం కందుకూరు మాజీ ఎమ్మెల్యే డాక్టరు దివి శివరాం దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలు అంశాలపై చర్చించారు. శివరాం వెంట ఆయన సతీమణి దివి సౌభాగ్యతో పాటు టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గోచి పాతల మోషే ఉన్నారు.

ఉద్యాన రైతుల ఆర్థిక చేయూతకే రాయితీలు

జ్యోతి, మండల ఉద్యాన అధికారి



ఉలవపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకే ప్రభుత్వం మెరుగైన రాయితీలు కల్పించింది. ఈ అవకాశాలను రైతులు అందిపుచ్చుకుని ఆధునిక పద్ధతు లతో పంటల సాగును విస్తరించుకోవాలన్నారు.

? అధికంగా సాగులో ఉన్న పంటలు ఏవి.

! మండలంలో సుమారు 5వేల ఎకరాల్లో మామిడి, 1300 ఎకరాల్లో సపోటా ప్రధాన పంటలుగా సాగులో ఉన్నాయి.

? సపోటా సాగుకంటే మామిడి పంట సాగుపై మక్కువకు కారణం.

! మండలంలో గత 15 ఏళ్ల క్రితం సపోట సాగు, మామిడి సాగు రమారమి ఒకటిగానే ఉండేది. పునాస దాదాపు ఏడాదిపాటు పంట కాపు వస్తుంది. దీనికితోడు పనాస జూలై, ఆగస్టు మాసాల్లో టన్ను రూ.70వేల వరకు పలకడం రైతుల్లో పనాస మామిడి సాగుపై మక్కువ పెంచుకుని సాగు చేస్తున్నారు. మండలంలో సపోటా సాగు తగ్గిపోయింది.

? ఉద్యాన రైతులకు ప్రభుత్వం ఏ రకమైన రాయితీలు ఇస్తుంది.

! నూతన ఉద్యాన తోటలు పెంపకం కింద ప్రభుత్వం రైతులకు సబ్సిడీ సౌకర్యం కల్పిస్తుంది. మామిడి తోటలు పెంచుకునే రైతులకు హెక్టారుకి మొక్కలు కొనుగోలు చేసి నాటుకునే వరకు తొలి ఏడాది రూ.7920 రాయితీ, రెండు, మూడు ఏడాదిల్లో వరసగా రూ.2660 చొప్పున తొలి మూడేళ్లల్లో రూ.13,300 రాయితీ అందిస్తుంది.

? ఎక్కువ పొలం ఉన్నోళ్లకి..

! 5ఎకరాలలోపు ఉన్న మామిడి రైతులకు కాయల గ్రేడింగ్, ప్యాకింగ్ కోసం ప్యాక్ హౌస్ నిర్మాణంలో 50 శాతం సబ్సిడీతో రూ.2లక్షలు రాయితీ కల్పిస్తుంది. ఎక్కువ కమతం ఉన్న రైతులకు పంట గ్రేడింగ్, ప్యాకింగ్, ఎగుమతులు చేసుకునే సౌకర్యం కోసం 40శాతం సబ్సిడీతో రూ.6లక్షల రాయితీ రైతులకు అందిస్తుంది.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం

● ఆత్మకూరు ఆర్డీవో పావని

సంగం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను చేపట్టిందని ఆత్మకూరు ఆర్డీవో పావని పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని పెరమన గ్రామ పంచాయతీలో జరిగిన రెవెన్యూ సదస్సును తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ వచ్చిన అర్జీలను సమస్యల తీరును బట్టి గడువు లోపు పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ ప్రత్యేకాధికారి రమేష్ నాయక్, తహసీల్దారు సోమ్లా నాయక్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● తోపుగుంటలో..

కలువాయి: తోపుగుంటలో అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు జనం నుంచి స్పందన కనిపించలేదు. కొద్దిమంది మాత్రమే హాజరై తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్యామ్ సుందర్‌రాజు, డీటీ మంజుల, వీఆర్వో అరుణమ్మ పాల్గొన్నారు.

● సీతారామపురం: మండల పరిధిలోని పబ్బులేటిపల్లి గ్రామ పంచాయతీలోని చింతోడు గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ కృష్ణారెడ్డి అధ్యక్షతన రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాసులు, సర్వేయర్ భాగ్యలక్ష్మి, వీఆర్వో మనోహర్ పాల్గొన్నారు.

● కలిగిరి: భూ సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలని తహసీల్దారు రవీంద్రబాబు కోరారు. శుక్రవారం తూర్పుదూబగుంటలో రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతులతో అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అన్నపూర్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● అన్నవరంలో..

జలదంకి: అన్నవరంలో జరిగిన రెవెన్యూ సదస్సులో వివిధ రకాల భూ సమస్యలపై 22 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా తహసీల్దారు ప్రమీల మాట్లాడారు. 45రోజులలో పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీజ, వీఆర్వో గిరి, మండల టీడీపీ అధ్యక్షుడు పి.మదురెడ్డి, టీడీపీ నేతలు పి.బాస్కర్‌రెడ్డి, పి.రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆదిమూర్తిపురంలో..

కొండాపురం: ఆదిమూర్తిపురంలో జరిగిన రెవెన్యూ సదస్సును కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని కోరారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు జరిగిన సదస్సుకు బండ్లబాట ఆక్రమణ, ఆలయ భూమి ఆక్రమణ, తన భూమిని ఆన్‌లైన్లో నమోదు చేయాలంటూ ముగ్గురు రైతులు వినతులు అందజేసినట్లు తహసీల్దార్ కోటేశ్వరరావు తెలిపారు.

● రెవెన్యూ గ్రామసభకు 15 వినతులు

ఉలవపాడు: బద్దిపూడిలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభకు 15 వినతులు వచ్చినట్లు తహసీల్దారు లావణ్య తెలిపారు. కార్యక్రమంలో గ్రామసభల ప్రత్యేక పర్యవేక్షణ అధికారి, డిప్యూటీ లేబర్ అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. భూ సర్వే పట్టాదారు పాసు పుస్తకాలు, మ్యుటేషన్, పలు రెవెన్యూ సమస్యలపై స్థానికులు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ఖాదర్ హుసేన్, వీఆర్‌వో రవి కుమార్, కార్యదర్శి పోలయ్య పాల్గొన్నారు.

● కావలి రూరల్: రుద్రకోటలో తహసీల్దారు శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి, ఆర్డీవో వంశీక్రిష్ణ, మండల ప్రత్యేక అధికారి మల్లారెడ్డి పాల్గొన్నారు. ముందుగా అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా సచివాయం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐ రాజేశ్వరరావు, రెవెన్యూ అధికారులు, టీడీపీ నాయకులు రెవెన్యూ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● లింగసముద్రం : ప్రజా సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సీతామహాలక్ష్మి తెలిపారు. మొగిలిచెర్ల పంచాయతీ నారసింహాపురంలో జరిగిన సదస్సులో ఆర్‌ఐ రమణయ్య, వీఆర్‌ఓ అమానుల్లాఖాన్, సర్వేయరు వెంకటేష్ పాల్గొన్నారు.



కొండాపురం: సదస్సులో పాల్గొన్న కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ



అన్నవరంలో రైతు నుండి అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ ప్రమీల



పెరమన రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో పావని



ఉలవపాడు: పాల్గొన్న మండల ప్రత్యేక అధికారి, జిల్లా డిప్యూటీ లేబర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

న్యూస్ బాక్స్

ఆలయాల పర్యవేక్షకుడికి సన్మానం

మనుబోలు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బద్దెవోలు గ్రామంలో రెండు నూతన దేవాలయాల పర్యవేక్షకుడు శ్రీమాన్ చిలకపాటి లక్ష్మీనరసింహాచార్యులను శుక్రవారం గ్రామస్థులు సన్మానించారు. శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయం, రామలింగేశ్వర ఆలయాలు శిథిలావస్థలో ఉండేవి. దీంతో గ్రామస్థులు చిలకపాటిని కోరగా ఆయన శిష్యులతో చెన్నకేశవ ఆలయానికి రూ.1.3 కోట్లు, రామలింగేశ్వర ఆలయానికి రూ.5లక్షలు విరాళంగా ఇప్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పొన్నూరు రామకృష్ణయ్య, శానంపూడి వెంకట కృష్ణారెడ్డి, శానంపూడి సురేంద్రరెడ్డి, బాల కృష్ణారెడ్డి, దాతలు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

విడవలూరు (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు చెముకుల శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.

జనసేనలో గిరిజనుల చేరిక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గోమతి నగర్‌లో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం రిటైర్డ్ రైల్వే ఉద్యోగి దాసరి పోలయ్య ఆధ్వర్యంలో 50కిపైగా గిరిజన కుటుంబాలు పార్టీలో చేరాయి. పార్టీ సీనియర్ నాయకుడు, కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు సుందర రామిరెడ్డి, గునుకుల కిషోర్, జమీర్, శ్రీరామ్, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే కేన్సర్ నివారణ

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : కేన్సర్ వ్యాధిని పూర్తి స్థాయి అవగాహనతోనే నిరోధించవచ్చని నగరంలోని రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ లక్ష్మి వెల్లడించారు. శుక్రవారం బైండింగ్ హోప్ ట్రస్ట్ కేన్సర్ ఆసుపత్రిలో వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నిర్మల్ కుమార్, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషా కిరణ్, జయప్రకాష్, డాక్టర్ గీత ఉషశ్రీ, కన్యాకుమారి పాల్గొన్నారు.

బాలుడి అప్పగింత

నెల్లూరు(క్రైం) (ఆంధ్రజ్యోతి) : పాఠశాలకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి తప్పించుకొని వచ్చిన బాలుడిని సంతపేట పోలీసులు సంరక్షించి తల్లికి అప్పగించారు. జనార్దన్‌రెడ్డి కాలనీ టిడ్కో ఇళ్లలో కరిముస్సీసా కుమారుడు మూడో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం పాఠశాలకు వెళుతున్నానని చెప్పి కపాడిపాలెం చేరుకున్నాడు. స్థానికులు సంతపేట పోలీసులకు సమాచారం అందజేశారు. ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు బాలుడిని అతని తల్లికి అప్పగించారు.

మహిళా పారిశ్రామికవేత్తల కోసం తీసుకుంటున్న చర్యలేమిటి?

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : మహిళా పారిశ్రామికవేత్తలకు, పొదుపు సంఘాల మహిళలకు మద్దతిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించాలని పార్లమెంటులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర మహిళా, శిశు అభివృద్ధిశాఖ మంత్రి అన్నపూర్ణదేవి సమాధానమిస్తూ డీఏవై-ఎన్‌ఆర్‌ఎల్‌ఎం కింద మహిళా పారిశ్రామిక వేత్తలకు, పొదుపు సంఘాల మహిళలకు మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని చెప్పారు.

ప్రతి అర్జీకి 45 రోజుల్లో పరిష్కారం

● 5 ఏళ్లలో జరిగిన అన్యాయాలకు న్యాయం చేస్తాం ● రెవెన్యూ సదస్సుల్లో సోమిరెడ్డి



సైదాపురం : రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీవో వసుమతి

మనుబోలు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చే ప్రతి అర్జీకి ప్రభుత్వం నుంచి 45 రోజుల్లో పరిష్కారం దొరుకుతుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. స్థానిక సచివాలయం-1లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. స్వయంగా రైతుల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలు విన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల రీసర్వేలో జరిగిన అన్యాయాలపై గ్రామసభలు నిర్వహించారన్నారు. ఇప్పుడు ఒక్క రీసర్వే కాకుండా మిగతా ఏ భూ సమస్య ఉన్నా పరిష్కరించేందుకు ప్రజలవద్దకే అధికారులు వెళ్లేలా సదస్సులు నిర్వహిస్తున్నార న్నారు. గడిచిన 5 ఏళ్లలో చాలా అన్యాయాలు జరిగాయన్నారు. రీసర్వే, ఫ్రీహోల్డ్, అసైన్‌మెంట్ పట్టాల పంపిణీ ఇలా చాలానే ఉన్నాయన్నారు. పేదలకు న్యాయం జరిగేలా, చట్టప్రకారం పనులు చేయాలని అధికారులను హెచ్చరించారు. గతంలో జరిగిన అక్రమాలు, నేరాలు, ఘోరా లన్నింటిని బయటకు తీస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి, తహసీల్దారు సుబ్బయ్య, ఎంపీడీవో జలజాక్షి, వీఆర్‌వోలు నాగార్జునరెడ్డి, శ్రీనువాసులు, కార్యదర్శి గరుడయ్య, టీడీపీ నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, సాని వెంకటరమణయ్య పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే...

తోటపల్లిగూడూరు,(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలు పరిష్కరించడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని మండల ప్రత్యేక అధికారి, జిల్లా స్పెషల్ కలెక్టర్ వెంకటరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చిన్నచెరుకూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సదస్సులలో భూ కొలతలలో తేడాలు, సర్వే నెంబర్ల మార్పులు, వారసత్వాల నమోదు, సరిహద్దుల సమస్యలు, విస్తీర్ణంలో తేడాల్సు, సీలింగ్ భూముల కబ్జా, అసైన్డ్ భూములు, చుక్కల భూముల సమస్యలు పరిష్కరిం చుకోవచ్చని తెలిపారు. ఈ కార్య క్రమంలో తహసీల్దారు టీవీఎస్ కృష్ణప్రసాద్, డిప్యూటీ తహసీల్దా రు శివయ్య, మండల సర్వేయర్ మహమ్మద్‌బాషా, రెవెన్యూ ఇన్ స్పెక్టర్ ద్వారకానాథ్, గ్రామ రెవెన్యూ అధికారి సురేష్, టీడీపీ నేత బొమ్మి సుమన్ పాల్గొన్నారు.



ముత్తుకూరు : అర్జీలు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

సాదాబైనామా సమస్యలు...

బుచ్చిరెడ్డిపాళెం,(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరారు. ఈ మేరకు మండలంలోని వవ్వేరులో తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో అర్జీలు అందజేశారు. ఈ సదస్సులో



టీపీగూడూరు : అర్జీలు స్వీకరిస్తున్న స్పెషల్ కలెక్టర్

ముఖ్య అతిథిగా మెప్మా పీడీ రాదమ్మ పాల్గొని అర్జీలు స్వీకరించారు. మొత్తం 18 అర్జీలు వచ్చాయని తహసీల్దారు తెలిపారు. కనిగిరి రిజర్వాయర్ పరిధిలో 920 సర్వే నెంబరులోని 54 ఎకరాలు నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని ఓ రైతు వినతిపత్రం అందజేయగా ఆ భూములపై ఎవరికీ హక్కు లేదని, అవి కనిగిరి రిజర్వాయర్‌కు చెందినవే అని మరో రైతు తహసీల్దారు దృష్టికి తెచ్చారు. ఈ సదస్సులో ఆర్‌ఐ నారాయణరెడ్డి, వీఆర్వో సుష్మ, మెప్మా సీవో నర్మద, స్థానిక నేత శివప్రసాద్‌నాయుడు, రైతులు పాల్గొన్నారు.

వేగూరులో...

కోవూరు,(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేగూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు నిర్మలానందబాబు పాల్గొని రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు అమరావతి, టీడీపీ నేత వేగూరు సుబ్బానాయుడు, సర్వేయర్ పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



బుచ్చి : వవ్వేరులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు

కృష్ణపట్నంలో...

ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి) : కృష్ణపట్నం గ్రామం సచివాలయ ప్రాంగణంలో జరిగిన రెవెన్యూ సదస్సులో. స్పెషల్ ఆఫీసర్, పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ డీ.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని చిఅర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో మోహన్ కుమార్, ఆర్‌ఐ వెంకటేష్, మండల డిప్యూటీ సర్వేయర్ అనురూప్, టీడీపీ నాయకులు కోదండయ్య, ఆనందయ్య, తదితరులు పాల్గొన్నారు.

చీకవోలులో...

సైదాపురం,(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకవోలులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి వసుమతి పాల్గొని రికార్డులను పరిశీలించారు. అనం తరం డిప్యూటీ తహసీల్దార్ అనురాధ మాట్లాడుతూ పట్టాదారు పాస్ పుస్తకాల కోసం 31 అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్ర మంలో ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ సర్వేయర్ వెంకటేశ్వర్లు, ఫారెస్ట్ సెక్షన్ అధికారి లోకేష్, దేవదాయ శాఖ ఈవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

సౌత్‌మోపూరులో...

నెల్లూరు రూరల్,(ఆంధ్రజ్యోతి): మండలంలోని సౌత్ మోపూరు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. తహసీల్దారు లాజరస్, ప్రత్యేకాధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు. భూ సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకువస్తే చట్టప్రకారం పరిష్కరిస్తామని వారు తెలిపారు. అర్జీల రూపంలో సమస్యను క్షుణ్ణంగా తెలియచేయాలని, తద్వారా క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు పరిష్కారం చూపడం జరుగుతుందన్నారు. కోర్టు పరిధిలోని సమస్యలు మినహాయించి మిగిలినవి ఉన్నత స్థాయి దృష్టికి తీసుకెళ్లిన న్యాయం చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో రీసర్వే డీటీ మాధవి, వీఆర్వో కే శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరురూరల్ : గ్రామసభలో తహసీల్దారు, అధికారులు

పర్యావరణాన్ని పరిరక్షించండి

● కలెక్టర్‌ను కోరిన దినేష్‌రెడ్డి

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి కలెక్టర్ ఆనంద్‌ను కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన కలెక్టర్‌తో భేటీ అయ్యారు. పర్యా వరణ పరిరక్షణకు చేపట్టాల్సిన కార్యక్రమాలు, జిల్లాలోని పరిశ్రమల వ్యర్థాలు నిర్వీర్యం చేసే విధానంపై చర్చించారు. కలెకర్ సానుకూలంగా స్పందించారు. జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు అన్నీ విధాలుగా సహకరిస్తానన్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న పోలంరెడ్డి దినేష్‌రెడ్డి

కోవూరులో పర్యటించిన దినేష్‌రెడ్డి

కోవూరు,(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్వీరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తొలిసారిగా శుక్రవారం కోవూరులో పర్యటించారు. ఆయనకు పలువురు టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక లక్ష్మీనగర్‌కు చెందిన పాలూరు వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లి గత నెలలో వివాహమైన ఆయన కుమారుడు, కోడలును ఆశీర్వదించారు. ఆయన వెంట కృష్ణచైతన్య, బాలారవి, ముసలి సుధాకర్, నాటకరాని వెంకట్, దారా విజయబాబు, చామంతిపురం వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి విగ్రహ ప్రతిష్ఠ

విడవలూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాదెలదిన్నె దళితవాడలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ముందుగా గణపతిపూజ, పుణ్యాహవాచనం, తదితర పూజలు నిర్వహించారు. అనంతరం విమాన కలశ ప్రతిష్ఠ చేశారు. శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్ల విగ్రహాలు ప్రతిష్ఠింపచేశారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం కనుల పండువలా జరిగింది. ఈ వేడుకలకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి టీడీపీ ఇన్‌చార్జి అడపాల శ్రీధర్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి చేతుల మీదుగా విరాళం అందజేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.



చెన్నకేశవ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ప్రణాళికతోనే ఉత్తమ ఫలితాలు

● 'స్టడీప్లస్'లో విద్యార్థులకు దిశానిర్దేశం

నెల్లూరు(విద్య), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదువుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సైకాలజిస్టులు సూచించారు. టౌన్‌హాలులో శుక్రవారం సైకాలజిస్టుల ఆధ్వర్యంలో స్టడీప్లస్ పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించారు. ఎయిడెడ్, మునిసిపల్, ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠ శాలలకు చెందిన విద్యార్థు లకు జీవిత లక్ష్యాలను, చేప ట్టాల్సిన వృత్తిని నిర్ధారించునేందుకు అవగాహన కల్పించారు. రానున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కు లతో ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన విద్యానైపుణ్యాలు, పరీక్షనైపు ణ్యాలపై శిక్షణ ఇచ్చారు. ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్‌బీ సుధాకర‌రెడ్డి, విశ్రాంత డీఈవో డాక్టర్ పీ రమేష్, విద్యావేత్త సిస్టర్ రోసి పరాక్కల్, సైకాలజిస్టులు కే డోనమిక్‌రెడ్డి, సీహెచ్ రమేష్ బాబు, వీ చంద్రశేఖర్ తదితరులు పలు అంశా లకు విద్యార్థులకు వివరించారు. ముందుగా ప్రముఖ విద్యావేత్త, రత్నం విద్యాసంస్థల అధి నేత, దివంగత కేవీ రత్నం చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సైకాలజిస్టులు

నాడు-నేడు పనులపై విచారణ చేయిస్తాం: ఎమ్మెల్యే

మనుబోలు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రూ లక్షలు తినేసి ఇలాగేనా నాడు-నేడు పనులు చేసేదంటూ ఎమ్మెల్యే సోమిరెడ్డి మండిపడ్డారు. విద్యాకమిటీ ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆయన స్థానిక బాలుర ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. గదులన్నీ తిరిగి దెబ్బతిన్న శ్లాబులను చూసి ఆశ్చర్యపోయారు. దీనిపై తప్పకుండా విచారణ చేయిస్తామన్నారు. అనంతరం బాలికల ఉన్నతపాఠశాలను సందర్శించారు. నాబార్డు నిధులతో చివరి పనులు చేయకుండా వదిలేశారని, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని ఉపాధ్యాయినులు ఎమ్మెల్యేకు విన్నవించారు. దీంతో ఆయన స్పందించి రూ.35వేలు తన సొంత నిధులు ఇస్తానని, రెండు రోజుల్లో పనులు పూర్తి చేయాలని పాఠశాల విద్యా కమిటీకి సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ బండికట్టు రవీంద్రబాబు, జితేంద్రగౌడ్, కలికి రమేష్‌రెడ్డి, పుట్టా మస్తాన్, చెల్లగిరి ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● టీడీపీ నేత నూనె లక్ష్మయ్య తండ్రి కృష్ణయ్య (75) శుక్రవారం మృతి చెందడంతో ఎమ్మెల్యే సోమిరెడ్డి మడమనూరులోని ఆయన నివాసాని కి చేరుకుని కృష్ణయ్య పార్థివదేహానికి నివాళులర్పించారు.

సమసమాజ స్వాప్నికుడు అంబేడ్కర్

● కార్యాలయాలు, విద్యా సంస్థల్లో వర్ధంతి ● ఘనంగా నివాళులు



డీకేడబ్ల్యూ కళాశాలలో మాట్లాడుతున్న ఆర్‌ఐవో శ్రీనివాసులు



వెంకటాచలం : నివాళులర్పిస్తున్న వీసీ విజయభాస్కర్‌రావు

నెల్లూరు(విద్య), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమసమాజ స్వాప్నికుడని, అందరికీ ఆదర్శ ప్రాయుడని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఆర్ బాలాజీరావు కొనియాడారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని నగరంలోని పలు విద్యా సంస్థలు, కార్యాలయాల్లో నిర్వహిం చారు. బాబా సాహెబ్ విగ్రహాలు, చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ అందరూ చదువుకోవాలన్న అంబేడ్కర్ సంకల్పంతో నేడు ఎంతో మంది పేద విద్యార్థులు అత్యున్నత స్థానాలకు చేరుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి, ఏఎంవో సుధీర్‌బాబు, ఏడీలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాలలో ఇంటర్ బోర్డు ఆర్‌ఐవో, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ శ్రీనివాసులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అంబేడ్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం దేశానికి దిక్సూచి వంటిదన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొండయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కరుణకుమారి, ప్రసన్న, భారతి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

● కొండాయపాళెం దళితవాడలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. అంబేడ్కర్ జీవిత చరిత్రను హెచ్ఎం భాస్కర్‌రావు విద్యార్థులకు వివరించారు.

● 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ కేడెట్స్ ఆధ్వర్యంలో వీఆర్‌సీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు, కేడెట్స్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో...

నెల్లూరు(హరనాథపురం): ఎమ్మార్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్లు బెల్లకొండ గోపి మాదిగ, కోలగట్ల రమేష్ మాదిగ నాయకత్వంలో వీఆర్సీ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు నివాళులు అర్పించారు. యువసేన కోఆర్డినేటర్ బద్దిపూడి వివేక్ మాదిగ, కోకన్వీనర్ అమ్మనబ్రోలు వెంకట మాదిగ, ఇంద సుధాకర్, కాకులూరు మధు పాల్గొన్నారు.

● సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పందిటి సుబ్బయ్య మాదిగ ఆధ్వర్యంలో నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. పలిగిలి చిన్నయ్య, డేనయల్ సల్మాన్, రియాజ్, సుధాకర్ పాల్గొన్నారు.

● ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఎస్‌పీ జాతీయ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్‌మాదిగ, జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ మాదిగ, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయ్‌కృష్ణమాదిగ, మందా పెంచలయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్స్ సంఘం..

నెల్లూరు(సాంస్కృతికం): పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం హనోక్, జిల్లా అధ్యక్షుడు ఆత్మకూరు రమేష్, ఉపాధ్యక్షుడు కే సుదర్శన్‌రాజు, సెక్రటరీ నక్క సునీల్ గవాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నివాళి..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జనసేన పార్టీ సీనియర్ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ పిలుపునిచ్చారు. వీఆర్‌సీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి జనసేన నాయకులు పూలమాలు వేసి నివాళులర్పించారు. గునుకుల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో..

నెల్లూరు,(లీగల్): న్యాయవాదుల ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీ ఉమా మహేశ్వర్‌రెడ్డి, ఎస్సీఎస్టీ న్యాయవాదుల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జల్లి పద్మాకర్, బద్దెపూడి రవీంద్ర న్యాయవాదులు పాల్గొన్నారు. దేశానికి అంబేడ్కర్ అందించిన సేవలను కొనియాడారు.

రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్

వెంకటాచలం,(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ రూపకర్త, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహానేత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు కొనియాడారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత తదితరులు పాల్గొన్నారు.

● కోవూరు,(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భగా నెల్లూరు పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇంటూరి విజయ్‌కుమార్, పంతంగి రామారావు, కలికి సత్యనారాయణరెడ్డి, దువ్వూరు రంగారెడ్డి, గొర్రిపాటి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

● విడవలూరు,(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు చంద్రశేఖర్, మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నగేష్‌కుమారి, ప్రభుత్వం డిగ్రీ కళాశాల్లో ప్రిన్సిపాల్ మధులు అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు.

రోడ్లపై పశువులను వదిలితే చర్యలే!

● 24 గంటల్లోపు సిటీప్లానింగ్ అనుమతులు ● ఏడాదిలోపు యూజీడీ, తాగునీటి పథకాలు పూర్తి ● మున్సిపల్ మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో రోడ్లపై పశువులతో ప్రజలకు ఇబ్బందులు ఎదుర వుతున్నాయని, ఆ పశువుల యజ మానులు తక్షణం స్పందించకుంటే చట్టం అమలు చేయాల్సి వస్తుందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ హెచ్చ రించారు. శుక్రవారం కార్పొ రేషన్ కార్యాలయంలో పలు విభాగాల అధికారులతో ఆయ న సమీక్షించారు. రోడ్లపై పశువులను నిలువరించేం దుకు వాటి యజమానులకు ఈ నెలాఖరు వరకు గడువు ఇచ్చామన్నారు. ఆపై కఠినంగా వ్యవహరిం చమని కార్పొరేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. నగరం లోని సుమారు 4,500 కుక్కలకు వ్యాక్సిన్ వేయాల్సి ఉందని, వారంలోపు ఆ ప్రక్రి య పూర్తి చేస్తామని మంత్రి చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సిటీప్లానింగ్ అనుమతులు 24 గంటల్లో మంజూరయ్యే విధంగా నూతన చట్టాలను రాష్ట్రంలో ఆవిష్కరించినట్లు తెలిపారు. అన్నీ పత్రాలతో ఉదయం దరఖాస్తు పెట్టుకుంటే రాత్రి పడుకునేలోపు అనుమతులు మంజూరైపో వాలని, ఆ మేరకు నూతన పాలసీని అమల్లోకి తీసుకువచ్చినట్లు వివరించా రు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఫైల్స్‌ను 48 గంటల్లో క్లియర్ చేస్తామని ప్రకటించారు. ఇబ్బందికర లేఅవుట్లను స్వయంగా పరిశీలించి ఇబ్బందులు తొలగిస్తామని చెప్పారు. శిథిలావస్థకు చేరిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లను కూల్చేసి నూతన నిర్మాణాలు చేపట్టమని ఆదేశిస్తున్నామన్నారు. నగరంలో రూ.120 కోట్ల వరకు ఆస్తిపన్ను రావాల్సి ఉందని, దానిని వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకాలను ఏడాది కాలంలో పూర్తి చేసి ప్రజలకు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నగర కమిషనర్ సూర్యతేజ, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్లు నిర్మించి ఇస్తాం

నెల్లూరు సిటీ పరిధిలోని అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ సొంత ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి నారాయణ హామీ ఇచ్చారు. కార్పొరేషన్‌లో సమీక్ష పూర్తయ్యాక ఆయనను జర్నలిస్టులు కలిసి విన్నవించుకోగా ఈ మేరకు స్పందించారు. 2025 మార్చిలోపు నెల్లూరు సిటీ పరిధిలో స్థల సేకరణ పూర్తి చేసి గ్రేటర్ కమ్యూనిటీ తరహాలో ఇళ్లు నిర్మించి జర్నలిస్టులకు అందచేస్తామని వెల్లడించారు. అత్యాధునిక వసతులు కల్పించి భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం నాయకులు మల్లికార్జున్, శ్రావణ్, సురేష్, మహబూబ్ పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు(వైద్యం,ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగ సంఘం హంస జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకర్‌రావు మంత్రి పొంగూరు నారాయణకు వినతిపత్రం అందించారు. శుక్రవారం నగరంలోని బీసీకేసీ కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో మంత్రిని కలిశారు.

మల్లేశ్వరస్వామి హుండీల లెక్కింపు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నవాబుపేట భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం హుండీల లెక్కింపు జరిగింది. ఈ ఏడాది ఆగస్టు 6వతేదీ నుంచి గురువారం వరకు భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.3,22,963 వచ్చాయి. కార్తీక మాసం సందర్శనం, ఇతర పూజా టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.3,50,000 వచ్చాయి. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవదయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్, ఈవో కవిత, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అజ్మీర్ దర్గాపై వివాదం వద్దు

● ముస్లింల ర్యాలీ, ధర్నా

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అజ్మీర్ షరీఫ్ దర్గాపై వివాదం రేపొద్దని కోరుతూ ముస్లింలు శుక్రవారం నగరంలో కోటమిట్ట నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేశారు. ముస్లిం ఫెడరేష్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మొహ్మద్ ఉల్ హక్ మాట్లాడుతూ పురాతన అజ్మీర్ షరీఫ్ దర్గాపై సర్వే పేరుతో ఉద్దేశ పూర్వకంగా దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ఎవరి ఆస్తులనైనా వక్ఫ్‌బోర్డు నోటీసులు ఇచ్చి స్వాధీనం చేసుకుంటుందని అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఆ దర్గాపై పిటిషన్‌ను రద్దు చేయాలని, లేకుంటే చలో అజ్మీర్ పాదయాత్రకు పిలుపునిస్తామని ప్రకటించారు. సింహపురి ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సయ్యద్ సమీ హుస్సేని, సయ్యద్ అబూ బకర్, మౌలానా అబ్దుల్ అజీజ్, ఖాజీ హఫీజ్ మస్తాక్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ముస్లింలు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

7

తిరుపతి

జిల్లా వార్తలు

శనివారం 7 డిసెంబరు 2024



తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరిరోజు శుక్రవారం మధ్యాహ్నం పంచమితీర్థం(చక్రస్నానం) భక్తజన ప్రవాహం నడుమ మంగళప్రదంగా జరిగింది. అమ్మవారు పుట్టిన తిథిగా భావించే కార్తీక మాసం శుక్లపక్ష పంచమి రోజున పద్మసరోవరంలో పంచమితీర్థఉత్సవం నిర్వహిస్తారు. ఈ సమయంలో పుష్కరిణిలో స్నానమాచరిస్తే మంచిజరుగుతుందనే నమ్మకంతో జనం పోటెత్తారు. అయితే తమిళనాడు నుంచి ఏటా భారీగా వచ్చే భక్తులు, ఈసారి వానల వల్ల కొంత తగ్గినట్లుగా కనిపించింది. రాత్రి 9.30 గంటలకు ధ్వజావరోహణంతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం

రాత్రి 9.30 నుంచి 11.00 గంటల మధ్య ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద అర్చకులు ప్రత్యేక పూజాదికార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణం రోజున ఎగురవేసిన గజపటాన్ని అవరోహణం చేశారు. ఉత్సవాల నిర్వహణకు ఆహ్వానించిన సకల దేవతలను, అష్టదిక్పాలకులకు బలినివేదన చేసి తిరిగి వారిని యథాస్థానానికి పంపించారు. ఉత్సవాల నిర్వహణలో పాలుపంచుకున్న పాంచరాత్ర ఆగమ పండితులు, అర్చకులను ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించి ఆలయ మర్యాదలతో ఇంటికి తీసుకెళ్లి వదిలిపెట్టారు.



ముగిసిన బ్రహ్మోత్సవాలు

పంచమికి పోటెత్తిన భక్త జనం



రాత్రి బంగారు పద్మంపై పద్మావతి

మధ్యాహ్నం చక్రస్నానం అనంతరం అమ్మవారిని పుష్కరిణికి ఎదురుగా ఉన్న గంగుండ్ర మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం శ్రీవారు పంపిన బంగారు ఆభరణాలతో అమ్మవారిని దివ్యంగా అలంకరించారు. రాత్రి 7.30 గంటలకు అమ్మవారు బంగారు పద్మంపై ఆసీనులై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు.

విజయవంతం

"ఎటువంటి అవాంతరాలు లేకుండా ఈ ఏడాది పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు వాహనసేవలను, మూలమూర్తిని దర్శించుకున్నారన్నారు. అన్నిశాఖల అధికారుల సమన్వయంతో పనిచేశారు. ఒక ప్రణాళిక ప్రకారం ఉత్సవాలు నిర్వహించడంతో ప్రతిఒక్కరూ వాహనసేవల్లో అమ్మవారికి కర్పూరహారతులు సమర్పించగలిగారు. అన్నప్రసాదాలు, పెద్దఎత్తున అందజేశాం."

- టీటీడీ ఈవో శ్యామలరావు

ఆ ఫుట్‌బాల్ ప్లేయర్ ఎక్కడో?



వెంకటగిరిలో గత ప్రభుత్వం నాపై ఒక ఫుట్‌బాల్ ప్లేయర్‌ని దింపింది. ఇప్పుడా ప్లేయర్ ఎక్కడున్నారోనని మిగిలిన ప్లేయర్లందరూ ఇంకా వెతుకుతూనే ఉన్నారు. ఇకపై వెంకటగిరిలో ఫుట్‌బాల్ ప్లేయర్లు కనిపించరు. కురుగొండ్ల రామకృష్ణ లేదంటే మంత్రిగా నేను మాత్రమే కనిపిస్తాం. ఈ నియోజకవర్గంలోని ఏ ప్రాంతం ఏ జిల్లాలో ఉందో తెలుసుకొనేలోపే ఐదేళ్లు ముగిశాయి.

- ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయశాఖ మంత్రి

జనం చెంతకు యంత్రాంగం

● తొలిరోజు 45 రెవెన్యూ సదస్సులు.. 1184 అర్జీలు

తిరుపతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించిన రెవెన్యూ సదస్సులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జనం వద్దకే రెవెన్యూ యంత్రాంగం వెళ్లింది. 1051 రెవెన్యూ గ్రామాలకు గాను తొలిరోజు 45 సదస్సులు నిర్వహించగా, 1092 మంది నుంచి 1184 అర్జీలు అందాయి. వాటిని ఆన్‌లైన్ చేసి రసీదులిచ్చారు. వీటిలో 29 సమస్యలకు అధికారులు అప్పటికప్పుడే పరిష్కార చూపారు. వచ్చిన అర్జీల్లో భూకబ్జాలకు సంబంధించి 21, 22ఏ నిషేధిత జాబితా భూములకు సంబంధించి 23 ఫిర్యాదులు ఉన్నాయి. భూకబ్జాలపై అత్యధికంగా తిరుపతి రెవెన్యూ డివిజన్ నుంచి 9 ఫిర్యాదులు వచ్చాయి. మిగిలిన అర్జీలు కొత్త రేషన్ కార్డులు, ఇతర సమస్యలకు సంబంధించినవి.



వడమాలపేట మండలం కల్లూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్

మేత భూములకు పట్టాలివ్వండి

చిల్లకూరు మండలం ఓడూరులో సదస్సుకు గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ హాజరయ్యారు. గ్రామ పరిధిలోని మేత పరంబోకు భూమిలో పంటలు సాగు చేసుకుంటున్న పేదలకే పట్టాలు మంజూరు చేసి కేటాయించాలని గ్రామస్తులు కోరారు. చెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన భూములు ట్రస్ట్ ఆధీనంలో ఉన్నాయని,

టీటీడీకి ఇచ్చిన భూములకు పరిహారం ఇవ్వండి

ఏర్పేడు మండలం పల్లం గ్రామంలో శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దారు భార్గవి పాల్గొన్నారు. 29 మంది రైతులు వివిధ సమస్యలపై అర్జీలిచ్చారు. అందులో అత్యధికంగా 19మంది తమ భూములను టీటీడీ ఉద్యోగుల ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని ఇంతవరకు పరిహారం ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు.

మేత భూముల్లోకి రానివ్వని శ్రీసిటీ యాజమాన్యం

సత్యవేడు మండలం శ్రీసిటీ పరిధిలోని చెరివి గ్రామంలో 25అర్జీలు అందాయి. ప్రధానంగా శ్రీసిటీ పరిధిలోని పంచాయతీకి చెందిన మేత బీడు భూములను గ్రామానికి కేటాయించాలని పలువురు రైతులు కోరారు. పశువుల మేతకు భూముల్లే ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. తమ పశువులను మేత భూముల్లోకి రానివ్వకుండా శ్రీసిటీ యాజమాన్యం అడ్డుకుంటోందని ఫిర్యాదు చేశారు. తామిస్తున్న అర్జీలకు రసీదులు ఇవ్వడం లేదని రెవెన్యూ సిబ్బందిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాంకేతిక కారణాల వల్ల ఆన్‌లైన్ రసీదులు ఇవ్వలేకపోతున్నామని, అందుకే మాన్యువల్‌గా ఇస్తున్నామని సిబ్బంది సమాధానం ఇచ్చారు.

శ్మశాన సమస్యపై అధికారుల పరిశీలన: పుత్తూరు మండలం తడుకులో రంగుంట, తడుకు, తడుకు దళితవాడల్లో శ్మశానాలకు స్థల సమస్య ఉందని పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పటికప్పుడే అధికారులు శ్మశాన భూములను పరిశీలించారు.హైకోర్టులో పెండింగ్ ఉన్న విద్యుత్తు సదాశివపురం వివాదాస్పద భూముల్లో ఈ-పాస్ పుస్తకాలు ఇవ్వాలని రైతులు అర్జీలు ఇచ్చారు.

22ఏ నుంచి తొలగించండి : తిరుపతి అర్బన్ పరిధిలో తుడా కార్యాలయం వెనుకగల కచ్చపి ఆడిటోరియంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు 20 అర్జీలు అందాయి. ద్వారకానగర్, రామచంద్రనగర్, శివజ్యోతి నగర్‌కు చెందినవారు తమ ఆస్తులను 22ఏ నుంచి తొలగించాలని కోరారు.

● తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లెలో భూసమస్యల కన్నా రేషన్ కార్డులు, పింఛన్లు, ఇంటి స్థలాల కోసమే ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి.

● చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీలో 111 అర్జీలు వచ్చాయి. ఆర్వోఆర్, మ్యూటేషన్, రేషన్ కార్డులు తదితర సమస్యలపై వినతులిచ్చారు.

● వడమాలపేట మండలం కల్లూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌తో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు. బాలాయపల్లి మండలం వెంకటరెడ్డిపల్లి సదస్సుకు జేసీ శుభంబన్సాల్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా హాజరయ్యారు.

భూ ఆక్రమణలు.. 22ఏ సమస్యపై 44 ఫిర్యాదులు

తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి: 'జిల్లాలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులకు 1184అర్జీలు వచ్చాయి. వీటిలో భూ ఆక్రమణలు, 22ఏ కేసుల సమస్యలపై 44 అర్జీలు, భూసంబంధి, ఇతర సమస్యలకు 1140 అర్జీలు వచ్చాయి. వీటిలో మూడు భూ సమస్యలు, ఇతర సమస్యలకు సంబంధించి 26 అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరించాం' అని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మిగిలిన వాటిని కాలపరిమితి లోపల సంబంధిత అధికారులు పరిష్కరిస్తారన్నారు.

2,322 ప్రభుత్వ బడుల్లో నేడు మెగా పీటీఎం

● పాల్గొననున్న 1.56 లక్షల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

● పార్టీలకు అతీతంగా గ్రామస్థాయి నాయకుల భాగస్వామ్యం

తిరుపతి(విద్య), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 2,322 ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) జరగనుంది. విద్యారంగాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్ది, విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. ప్రతిసారి సర్వసాధారణంగా నిర్వహించే పేరెంట్స్. టీచర్స్ మీటింగ్‌ను ఈసారి మరింత ప్రయోజనకరంగా జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులను మెగా పీటీఎంలో భాగస్వాములను చేయాలని ఇప్పటికే ఆదేశాలను జారీ చేసింది. విద్యారంగంలో రాజకీయాలకు తావులేకుండా ఆయా పార్టీల నాయకులు పార్టీ చిహ్నాలు, కండువాలు తదితరాలు లేకుండా పాల్గొనాలని పిలుపునిచ్చింది. మెగా పీటీఎం నిర్వహణకు జిల్లాకు సుమారు రూ.43 లక్షలు విడుదల చేసింది. ఈ మొత్తంతో ఆయా పాఠశాలల్లో సదస్సు నిర్వహణకు సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మెగా పీటీఎం జరగనుంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఒకే వేదికపైకి రానున్నారు. విద్య, సామాజిక పరంగా విద్యార్థి స్థితిగతులను తెలుసుకుని తగిన చర్యలు తీసుకునేందుకు ఈ వేదిక ఇంతకు మునుపుకంటే ఎంతో ఉపయుక్తం కానుంది.

శ్రీవారి దర్శనానికి 7 గంటలు

తిరుమల, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి 7గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5గంటల వరకు 8 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. ఇక, బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ లెక్కించగా, రూ.2.97 కోట్లు లభించినట్లు శుక్రవారం ఉదయం ప్రకటించింది.

'తూర్పు'నకు రానున్న రైలు



'తూర్పు' ప్రాంతానికి రైలు కూత పెట్టనుంది. ఈ ప్రాంత ప్రజల ఐదు దశాబ్దాల కల త్వరలో పట్టాలెక్కనుంది. పుత్తూరు నుంచి నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల మీదుగా చెన్నై అత్తిపట్టు వరకు కొత్త రైల్వేలైన్ ఏర్పాటు కోసం ఎట్టకేలకు రైల్వేశాఖ అనుమతిచ్చింది. రైల్వేశాఖ తీసుకున్న ఈ నిర్ణయంతో సత్యవేడు నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- సత్యవేడు, ఆంధ్రజ్యోతి

పట్టాలెక్కనున్న అయిదు దశాబ్దాల కల

అత్తిపట్టు-పుత్తూరు రైల్వే లైన్‌కు నిధులు మంజూరు

పుత్తూరు నుంచి సత్యవేడు నియోజకవర్గంలోని నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల మీదుగా తమిళనాడులోని చెన్నై హార్బర్ వరకు నిర్మించ తలపెట్టిన అత్తిపట్టు- వేపగుంట రైల్వేలైన్ నిర్మాణం అయిదు దశాబ్దాలుగా ప్రతిపాదన దశలోనే ఉంది. 1970లో అప్పటి కేంద్ర ప్రభుత్వం అత్తిపట్టు నుంచి పుత్తూరులోని వేపగుంట వరకు కొత్త రైల్వేలైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంచేసింది. 88 కిలో మీటర్లున్న ఈ రైల్వేలైన్ నిర్మాణం తమిళనాడు(చెన్నై)లోని అత్తిపట్టు రైల్వేస్టేషన్ నుంచి మొదలై పెరియపాళెం, పాలవాక్కం, ఊత్తుకోట మీదుగ రాష్ట్రంలోని నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం, వేపగుంట మీదుగా పుత్తూరు వరకు ఎనిమిది రైల్వేస్టేషన్‌లను నిర్మించాల్సి ఉంది. అందుకు 189 హెక్టార్ల భూమిని సేకరించాలని రైల్వే ఇంజనీరింగ్ అధికారులు అప్పట్లో ప్రతిపాదనలు సిద్ధంచేశారు. అప్పటి నుంచి బడ్జెట్‌లో నిధులు కేటాయించక పోవడంతో దశాబ్దాలుగా కార్యరూపం దాల్చడంలేదు. అయితే 2012-2013 ఆర్థిక సంవత్సరంలో ఈ రైల్వేలైన్ నిర్మాణానికి భూసేకరణ పనులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీంతో సదరన్ రైల్వే అధికారులు అప్పటి జిల్లా కలెక్టర్ సాల్మన్ ఆరోగ్యరాజ్‌ను కలిసి భూసేకరణకు సహకరించాలని కోరారు. రైల్వే మ్యాప్‌ను పరిశీలించిన అప్పటి కలెక్టర్.. భూసేకరణ చేసి రైల్వే అధికారులకు అప్పజెప్పాలని నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం తహసీల్దార్లను ఆదేశించారు. భూసేకరణకు ప్రత్యేకాధికారిగా అప్పటి జేసీ వినయ్‌చంద్ పర్యవేక్షణలో భూసేకరణకు సంబంధించిన నివేదికలను ప్రభుత్వానికి అందించారు. అయితే, అప్పటి బడ్జెట్‌లో కూడా కేంద్రం నిధులు కేటాయించలేదు. దీంతో ఈ ప్రాంతంలో రైల్వేలైన్ ఏర్పాటు కానుందని సంబరపడిన నియోజకవర్గ ప్రజలకు మళ్లీ నిరాశే మిగిలింది. ఇలా ప్రతిసారీ బడ్జెట్‌లో అత్తిపట్టు - పుత్తూరు రైల్వేకూత వినబడుతుందని ఆశగా ఎదురుచూడ్డం, నిరాశచెందడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం 2024- 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చెన్నై రైల్వేజోన్‌లో పుత్తూరు- అత్తిపట్టు రైల్వేలైన్ భూసేకరణకు రైల్వేశాఖ అనుమతిచ్చింది. దీంతో మళ్లీ నియోజకవర్గ ప్రజలకుఆశలు చిగురుస్తున్నాయి. ఈ రైల్వేలైన్ నిర్మాణం రూపుదాల్చితే సత్యవేడు, నగరి నియోజకవర్గాల్లోని పలు మండలాల ప్రజలకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు వ్యాపారాభివృద్ధి గణనీయంగా పెరగనుంది.

కార్మికుల భద్రతే లక్ష్యం: మంత్రి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్మికుల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సేఫ్టీ వెల్ఫేర్ ఆఫ్ వర్కర్స్, పరిశ్రమల శాఖపై ఆయన కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో కలిసి సమీక్షించారు. భద్రత విషయంలో పరిశ్రమల యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్మికుల భద్రత, సంక్షేమం, ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాలో పదిమందితో కూడిన కమిటీని ఏర్పాటు చేసి, ఛైర్మన్‌గా కలెక్టర్ వీటిని పర్యవేక్షించాలన్నారు. కార్మిక చట్టాలు అమలయ్యేటట్లు చూడాలన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈఎస్ఐ ఆస్పత్రులకు రావాల్సిన రూ.610 కోట్లు వెనక్కు వెళ్లాయన్నారు. కనీసం ఈఎస్ఐ భవనాన్ని కూడా నిర్మించలేదన్నారు. జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి అవకాశాలను పరిశీలిస్తామన్నారు. విశ్రాంత ఐఏఎస్ వసుధా మిశ్రాతో ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ ఇదివరకే వైజాగ్, చిత్తూరు, తిరుపతి ప్రాంతాల్లో పరిశ్రమలను పరిశీలించిందని, కమిటీ నివేదిక ఆధారంగా నిబంధనలు అమలు చేస్తామన్నారు. వైఎస్సార్ బీమాలో అవినీతి జరిగిందని, 3,593 మంది బీమా కోసం దరఖాస్తు చేసుకోగా 958 మందికే చెల్లించారని, రూ.178 కోట్లకుగాను రూ.47 కోట్లు మాత్రమే ఇచ్చారని వివరించారు. స్థానిక యువత అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఏర్పాటు చేస్తామన్నారు. పరిశ్రమలకు అవసరమయ్యే మానవ వనరులు అందించి స్థానికంగా 75 శాతం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా గత ఐదేళ్లలో వివిధ పరిశ్రమల్లో 22 ప్రాణాంతక ప్రమాదాలు జరిగాయని, అందులో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అలాంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. సమావేశంలో జాయింట్ లేబర్ కమిషనర్ బాలునాయక్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఈఎస్ఐలో సేవలు భేష్

తిరుపతి(వైద్యం): తిరుపతి ఈఎస్ఐ ఆస్పత్రిలో రోగులకు మంచి సేవలు అందుతున్నాయని మంత్రి సుభాష్ కితాబిచ్చారు. శుక్రవారం ఆయన స్థానిక ఈఎస్ఐ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పురుషుల వార్డును తనిఖీ చేసి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. సిబ్బంది ముఖహాజరు, సమయపాలన అంశాలను పరిశీలించారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శ్యాంబాబు, ఆర్ఎంవో డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

మమ అనిపించారు!

● ఫిర్యాదుదారుల్లేక సామాజిక తనిఖీ బహిరంగ సభ వెలవెల

● ఒకరి సస్పెన్షన్.. రూ.1.36 లక్షల రికవరీకి ఆదేశం

శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడులో శుక్రవారం నిర్వహించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ ఫిర్యాదుదారులు లేక వెలవెలబోయింది. బహిరంగ సభలో సగం ఖాళీ కుర్చీలో దర్శనమిచ్చాయి. వచ్చామా.. వెళ్లామా అన్న రీతిలో సామాజిక తనిఖీ బహిరంగ సభ జరిగిందన విమర్శలు వచ్చాయి. 17వ విడదల సామాజిక తనిఖీ బహిరంగ సభకు అధ్యక్షులుగా ఎంపీడీవో సురేంద్రనాథ్ వ్యవహరించగా ముఖ్యఅతిథిగా డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ హాజరయ్యారు. మొత్తం 27పంచాయతీలో జరిగిన రూ.7.12కోట్లతో పూర్తి చేసిన పనులపై 12మంది డీఆర్పీలు సామాజిక తనిఖీలు నిర్వహించారు. కాసరం ఫీల్డ్ అసిస్టెంట్ బాలసుబ్రహ్మణ్యం మస్టర్లలో ఒకే సంతకాలు ఉండటం, కుటుంబ సభ్యుల పేర్లను గుర్తించడంతో ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు పీడీ తెలిపారు. రూ.1.36లక్షలు రికవరీకి ఆదేశించారు. పలువురు ఉపాధి సిబ్బందికి రూ.45వేలు జరిమానా విధించారు.





భక్తజనసాగరం

వేడుకగా పంచమీతీర్థం

శుక్రవారం వేకువజాము నుంచే పంచమి వేడుకలు తిరుచానూరులో మొదలయ్యాయి. పద్మావతీ అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాల అనంతరం పల్లకి ఉత్సవం నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకు సన్నిధి ముఖమండపంలో చూర్ణాభిషేకం, ఆస్థానం నిర్వహించారు. అనంతరం అమ్మవారు, చక్రత్తాళ్వార్లను వేంచేపుగా పద్మసరోవరం పంచమీతీర్థ మండపంలో కొలువుదీర్చారు. సరిగ్గా10.35 గంటలకు తిరుమల నుంచి శ్రీవారు పంపిన సారె ఈ మండపానికి చేరుకుంది. అనంతరం ముత్తైదువ సారెతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం 12.20 గంటలకు అభిజిత్ లగ్నం శుభ గడియల్లో పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా చక్రత్తాళ్వార్‌ను పుష్కరిణిలో అర్చకులు మూడుసార్లు మునక వేయించారు.ఇదే సమయంలో అశేష భక్త జనం 'శ్రీ పద్మావతీ పాహిమాం, గోవిందా... గోవింద' అంటూ పుష్కరిణిలో మునకలేశారు. కాగా పొద్దుపోయే వరకూ సుమారు లక్ష మంది వరకు పుణ్యస్నానాలు ఆచరించినట్లు టీటీడీ అంచనా.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

పద్మావతికి 1.11 కోట్ల పుట్టినరోజు కానుకలు

పుట్టినరోజున పద్మావతమ్మకు శ్రీనివాసుడు ఈ ఏడాది వజ్రాభరణాలను కానుకగా పంపడం విశేషం. తిరుమల నుంచి పాండియన్ కిరీటం, వజ్రాల లక్ష్మీపతకం, హారం, గాజులు, జత కమ్మలు అందాయి. వీటి విలువ రూ.1.11 కోట్లు. ప్రతియేటా చక్రస్నానం రోజున శ్రీవారు ఆభరణాలను పంపించడం ఆనవాయితీ. వీటిని పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి అలంకరించారు.







ఆర్టీసీ చరిత్రలో తొలిసారిగా ఇన్‌చార్జుల పాలన

● జిల్లాలో ఆరు కీలక పోస్టులు ఖాళీ

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ చరిత్రలో తొలిసారిగా జిల్లా ప్రజారవాణా సంస్థలో ఆరు కీలక పోస్టులు ఖాళీ పడగా, ఇన్‌చార్జ్‌ల పాలన కొనసాగుతోంది. గతంలో ఒకటి రెండు పోస్టులకు ఇన్‌చార్జి అధికారులను నియమించినా వారం వ్యవధిలో రెగ్యులర్ అధికారులను నియమించేవారు. ఏళ్ల తరబడి ఇన్‌చార్జీలతోనే సరిపెట్టేస్తుండటం గమనార్హం. రాష్ట్రంలోనే ఎక్కువ డిపోలు, అధిక ఉద్యోగులు, బస్సులు, మెజారిటీ ప్రయాణికుల రవాణా, రాబడి కూడా ఎక్కువే, అధిక సంఖ్యలో వాణిజ్య దుకాణాలు, కార్గో ప్రధాన కేంద్రం ఇలా అన్ని విభాగాలలో జిల్లా మిన్నగానే ఉంటోంది. ఇన్‌చార్జ్‌ల పాలన విషయం విజయవాడ ప్రధాన కార్యాలయంలో తెలిసినా పట్టించుకోవడం లేదనే అసంతృప్తి అధికారుల్లో ఉంది. ప్రపంచ పుణ్యక్షేత్రం తిరుపతి కావడంతో ప్రజారవాణా సంస్థకు సంబంధించిన వ్యవహారాలు బిజీగానే ఉంటాయి. అలాగే తిరుమల ప్రోటోకాల్ పనులు కూడా తరచూ ఉంటాయి. ప్రత్యేక ఉత్సవాలు, పర్వదినాలు వంటి రోజుల్లో బస్సులు అదనంగా నడపాల్సి ఉంటుంది. ఇంత క్లిష్టంగా ఉండే తిరుపతి జిల్లాలో ఏపీఎస్ ఆర్టీసీ విభాగం ప్రధాన అధికారి నుంచి మరో ఐదు అధికారుల పోస్టులకు ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతుండటం కొసమెరుపు.

ఇంచార్జ్ పోస్టుల వివరాలు...

● డిస్ట్రిక్ట్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్(డీపీటీవో)గా ఉన్న సీనియర్ అధికారి టి.చెంగల్‌రెడ్డికి పదోన్నతి లభించడంతో గత అక్టోబరులో విజయవాడ ప్రధాన కార్యాలయానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆ స్థానంలో చిత్తూరుజిల్లా డీపీటీవో జగదీష్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు.

● పర్సనల్ ఆఫీసర్(పీవో)గా పార్థసారధి గత మేనెలాఖరులో పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి చిత్తూరు పీవో సహజాద్‌కు పీవోగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

●తిరుపతి కమర్షియల్ ఏటీఎం సురేంద్రబాబు గత మేనెల్లో పదవీ విరమణ చేయగా, సీటీఎస్ ఏటీఎం డి.రామచంద్ర నాయుడు అదనపు బాధ్యతలు స్వీకరించారు.

● చెన్నై అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్లు(ఏటీఎం) రెండేళ్ల క్రితం బదిలీలపై వెళ్లగా తిరుపతి సీటీఎస్ ఏటీఎం డి.రామచంద్ర నాయుడు అప్పటి నుంచి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈయనకు సీటీఎస్ ఏటీఎం విధులే అత్యంత కీలకం, క్లిష్టం. అయినా చెన్నై ఏటీఎంగా దాదాపు రెండేళ్ల నుంచి, తిరుపతి కమర్షియల్ ఏటీఎంగా గత జూన్ నెల నుంచి కొనసాగుతున్నారు.

●శ్రీకాళహస్తి డిపో మేనేజర్‌గా రాజవర్ధన్‌రెడ్డి గత సెప్టెంబరులో పదవీ విరమణ చేశారు. ఆ స్థానాన్ని తిరుపతి డీఎం బాలాజీకి అదనపు బాధ్యతలు అప్పగించారు.

● తాజాగా గత శనివారం డిప్యూటీ సీటీఎం భాస్కర్ పదవీ విరమణ చేయగా ఆ ఖాళీని తిరుమల డిపో మేనేజర్ విశ్వనాథంకు అదనపు బాధ్యతలు ఇచ్చారు. జిల్లాలోనే అత్యంత కీలకమైన తిరుమలడిపో వ్యవహారాలను చక్కబెట్టడడం గగనం. అయితే డిప్యూటీ సీటీఎంగా ప్రధాన బాధ్యతల నిర్వర్తించడం పనిభారమే అవుతుంది. తిరుపతిలో మధ్యాహ్నం వరకు ఆపైన కొండకు వెళ్లాల్సివుంది.



సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - వాసంశెట్టి సుభాష్ - స్మిత

ప్రసాదాల నాణ్యత పెరిగింది

తిరుమల, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, గాయని స్మిత దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. తిరుమలలో అందరూ సమానమే భావన కనిపిస్తోందని మంత్రి సుభాష్ అన్నారు. ప్రసాదాల నాణ్యత కూడా బాగా పెరిగిందన్నారు. రాష్ట్రంలోని ఇతర ఆలయాల్లోనూ ప్రసాదాల రుచి పెరిగినట్లు చెప్పారు. ఆర్థికంగా క్లిష్టపరిస్థితుల్లో ఉన్న ఏపీని గట్టెక్కించాలని, తెలుగు ప్రజలందరికీ ఆశీర్వాదాలు ఇవ్వాలని స్వామిని ప్రార్థించినట్లు మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు.

రిటైర్డు అదనపు ఎస్పీ జీవీ రమణ మృతి



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల్లో వివిధ హోదాల్లో పనిచేసి అదనపు ఎస్పీగా ఉద్యోగ విరమణ పొందిన జీవీ రమణ శుక్రవారం మృతి చెందాడు. ఆయన తిరుపతిలోని పోస్టల్ కాలనీలో కాపురముంటున్నారు. రిటైర్డు అదనపు ఎస్పీలు అభిషేకం, దేవదానం, సాంబశివారెడ్డి, నారాయణస్వామి, శ్రీనివాసులు, రిటైర్డు డీఎస్పీలు గంగరాజు, పోతప్ప, నంజుండప్ప, రవిశంకర్ రెడ్డితో పాటు జిల్లా పోలీసు అధికారుల సంఘం నాయకుడు శంకర్ రెడ్డి తదితరులు రమణ మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. శనివారం ఆయన అంత్యక్రియలు తిరుపతిలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వేలిముద్ర వేయగానే ఖాతాలో నగదు మాయం

● ఇద్దరు యువకులపై కేసు

గూడూరు,డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయిస్తామన్నారు. బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు అనుసంధానం చేయాలని నమ్మించారు. ఆధార్ డివైజ్‌తో వేలిముద్రలు తీసుకున్నారు. నగదూ వసూలు చేశారు. ఇక, వేలి ముద్ర వేయగానే కొందరి బ్యాంకు ఖాతాల నుంచి నగదు విత్‌డ్రా చేసినట్లు మెసేజీలు వచ్చాయి. గూడూరు మండలంలోని రెడ్డిగుంటసంగంలో ఇలా జరగడంతో గ్రామస్తులు శుక్రవారం ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.రూరల్ ఇన్‌చార్జి ఎస్‌ఐ సుబ్రహ్మణ్యంరాజు తెలిపిన ప్రకారం.. సైదాపురం గ్రామానికి చెందిన గోపి, వెంకటేశ్వర్లు రెడ్డిగుంట సంగం గ్రామానికి వెళ్లారు.ఉచిత గ్యాస్ కనెక్షన్ కోసమని ఆధార్ డివైజ్‌లో ఓ మహిళ వద్ద వేలిముద్ర వేయించారు.అంతే, కాసేపటికి ఆమె ఖాతాలో రూ.1000 నగదు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో గ్రామస్తులకు అనుమానం వచ్చింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గోపి, వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

హోంగార్డులు నైపుణ్యం పెంచుకోవాలి

రిజర్వు ఏఎస్పీ శ్రీనివాసరావు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికనుగుణంగా హోంగార్డులు వృత్తి నైపుణ్యతను పెంచుకోవాలని రిజర్వు జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. హోంగార్డుల 62వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం పోలీసు పరేడ్ గ్రౌండులో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బందితో పోలిస్తే హోం గార్డులకు సౌకర్యాలు తక్కువగా ఉన్నా కొన్ని సందర్భాల్లో వారికంటే ఎక్కువ సేవ చేస్తున్నారన్నారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన హోంగార్డులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు చిరంజీవి, పోతులురాజు, హోంగార్డులు, సిబ్బంది పాల్గొన్నారు.



హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవంలో శ్రీనివాసరావు

తిరుమలలో మహారాష్ట్ర భక్తుడి అదృశ్యం



అనిల్ మార్ఖాకర్ (ఫైల్ ఫొటో)

తిరుమల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన మహారాష్ట్ర భక్తుడు కనిపించకుండా పోయినట్లు తిరుమల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన అనిల్ మార్ఖాకర్(45) మరో 30 మందితో కూడిన భక్తబృందంతో గతనెల 29వ తేదీన తిరుమలకు వచ్చాడు. తలనీలాలు సమర్పించి ఉచిత క్యూ ద్వారా ఆలయంలోకి వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో దర్శనం పూర్తిచేసుకుని తిరిగి వచ్చే క్రమంలో ఆలయ మహద్వారం వద్ద రద్దీలో బృందం నుంచి విడిపోయాడు. వెంటనే బృందంలోని సభ్యులు అతని కోసం తిరుమల మొత్తం గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో సొంతూరికి వెళ్లి చూశారు. అక్కడా లేకపోవడంతో ఆయన కుమారుడు రోహన్ శుక్రవారం తిరుమలకు చేరుకుని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు తెలిసినవారు 94407 96769కు తెలియజేయాలని పోలీసులు కోరారు.

త్వరలో భారీగా సీఐల బదిలీలు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): త్వరలో భారీ ఎత్తున సీఐల బదిలీలు జరగనున్నాయి. తిరుపతి ఈస్ట్, తిరుమల టూటౌన్, తిరుపతి క్రైం స్టేషన్‌లో రెండు, భాకరాపేట సర్కిల్ కార్యాలయాల్లో రెగ్యులర్ సీఐలు లేరు. ఇక్కడ రెగ్యులర్ సీఐలను నియమిస్తూ భారీగా బదిలీలు జరగనున్నట్లు తెలిసింది. తిరుపతి ఈస్ట్ స్టేషన్‌లో పనిచేస్తున్న సీఐని వీఆర్‌కు పంపిన అధికారులు.. ఇప్పటి వరకు ఇక్కడ రెగ్యులర్ సీఐని నియమించలేదు. ప్రస్తుతం తిరుపతి వెస్ట్ సీఐ రామకృష్ణ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇక భాకరాపేట సీఐగా జిల్లా కేంద్రంలో సోషల్ మీడియాలో సీఐగా పనిచేస్తున్న ఇమ్రాన్‌బాషాను ఇన్‌చార్జిగా నియమించారు. తిరుమల టూ టౌన్‌కు జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో ఉన్న శ్రీరాముడిని ఇన్‌చార్జిగా నియమించారు. వీరందరినీ పరిపాలనా సౌలభ్యం దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ అటాచ్‌మెంట్లు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక తిరుపతిలో కీలకమైన క్రైం స్టేషన్‌లోనూ ఇద్దరు సీఐలు లేరు. డీఎస్పీనే చూసుకోవాల్సి వస్తోంది. ఇక, ఐదు నెలల కాలంలో పనితీరు, గంజాయి అక్రమ రవాణా, డ్రగ్స్ సరఫరా, పాత కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు న్యాయం చేయడంలో విఫలమైన ఒకరిద్దరు సీఐలపై వేటు పడనున్నట్లు సమాచారం. వారి స్థానంలో సమర్థులను నియమించాలని అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. తూర్పు మండలాలకు చెందిన ఇద్దరు అధికారులకు స్థాన చలనం తప్పదనే ప్రచారం జరుగుతోంది.



హైకోర్టు ఉత్తర్వులను అధికారులకు అందజేస్తున్న సంఘమిత్రలు

ఆ సంఘమిత్రలను కొనసాగించండి

● తీర్పునిచ్చిన హైకోర్టు

శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విధుల నుంచి తొలగించిన ఐదుగురు సంఘమిత్రలను తిరిగి కొనసాగించాలంటూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ఈ మేరకు సంఘమిత్రలు సీఐటీయూ నాయకులతో కలిసి వెలుగుశాఖ పీడీ శోభన్‌బాబుకి వినతిపత్రం సమర్పించారు. తొట్టంబేడు మండలంలోని పొయ్య, లింగమనాయుడుపల్లి, తాటిపర్తి, కొణతనేరి, కాసరం పంచాయతీల్లో పనిచేసే సంఘమిత్రలను ఇటీవల అధికారులు విధుల నుంచి తొలగించారు. దాంతో బాధితులు న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించారు. వారికి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించడంతో పాటు సంఘమిత్రలుగా కొనసాగించాలని కోర్టు ఉత్తర్వులను జారీ చేసింది. ఈ మేరకు సీఐటీయూ నాయకులు వెలుగుశాఖ పీడీని కలిసి కోర్టు ఉత్తర్వుల పత్రంతో పాటు తమ వినతిని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఆర్డీవో రామ్మోహన్, చెన్నయ్య, చంద్రశేఖర్, బాలకొండయ్య పాల్గొన్నారు.

రైల్వే ఎన్నికల్లో.. చివరి రోజు 86 శాతం పోలింగ్

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికల్లో భాగంగా చివరి రోజైన శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్‌లోని 34 పోలింగ్ కేంద్రాల్లో 86.16 శాతం ఓట్లు పోలయ్యాయి. చిత్తూరు, తిరుపతి, రేణిగుంట, పాకాల, శ్రీకాళహస్తి, వెంకటగిరి స్టేషన్లలో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. డ్రైవర్లు, గార్డులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. తిరుపతిలో 849, రేణిగుంటలో 825, శ్రీకాళహస్తిలో 132, వెంకటగిరిలో 143, చిత్తూరులో 164, పాకాలలో 327 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. బాక్స్‌లకు సీల్‌వేసి రేణిగుంట ఇన్‌స్టిట్యూట్‌లోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు.

మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలకు నిధులేవీ?

విడుదల చేసి మూడు రోజులైనా హెచ్ఎంలకు అందని నగదు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధిలో తల్లి దండ్రులను భాగస్వాములను చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 7వ తేదీన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ సమావేశాల నిర్వహణ కోసం పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి నిధులు అందజేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఈనెల 4వ తేదీన ఆయా మండల విద్యాశాఖ అధికారుల ఖాతాల్లో నిధులు జమచేసింది. అయితే శుక్రవారం సాయంత్రానికి కూడా నాయుడుపేట మండలంలో 90శాతం పాఠశాలలకు నగదు అందలేదు. దీంతో సమావేశాల నిర్వహణకు నగదు ఎలా సర్దుబాటు చేయాలో అర్థం కాక ప్రధానోపాధ్యాయులు తలపట్టుకుంటున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసి మూడు రోజులైనా ప్రధానోపాధ్యాయులకు నగదు అందించకపోవడానికి విద్యాశాఖ అధికారుల అలసత్వమే కారణమన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

స్వర్ణముఖిలో వృద్ధురాలు గల్లంతైనట్లు 100కు కాల్

పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వర్ణముఖి నదిలో గుర్తుతెలియని వృద్ధురాలు గల్లంతైనట్లు శుక్రవారం రాత్రి 100కు కాల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన అర్బన్ సీఐ బాబి, అగ్నిమాపకశాఖ సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. అయితే వృద్ధురాలు నదిలో పడిన సమయంలో చూసినట్లు ఎవరూ చెప్పలేదని సీఐ వెల్లడించారు. అయినా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు సీఐ తెలిపారు.

మైనింగ్ నిర్వహణ నిలిపివేయాలని నిరసన



మైనింగ్ వద్ద నిరసన చేస్తున్న కూటమి నాయకులు, గ్రామస్థులు

చిల్లకూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలబల్లిరెట్టపల్లి గ్రామ సమీపంలోని తెల్లరాయి మైనింగ్ నిర్వహణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కూటమి నాయకులు, గ్రామస్థులు మైనింగ్‌యార్డు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సమీపంలోని మేతపోరం బోకు భూమిలో గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమంగా మైనింగ్ నిర్వహణకు అనుమతులు ఇచ్చారన్నారు. ఈ భూమిలో మినుము సాగు చేసుకుంటున్న రైతులకు జీవనం లేకపోవడంతో పాటు పశువులకు మేత లేకుండా పోయిందన్నారు. అధికారులు పరిశీలించి మైనింగ్‌ను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆబాక రమణారెడ్డి, అన్నంరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి, వేణురెడ్డి, పారిచెర్ల భైరప్ప, తంబయ్య, వీరస్వామి, పెంచలయ్య, రాగమ్మ, వనమ్మ, రాజేశ్వరి, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఈవోగా సనత్‌కుమార్ బాధ్యతల స్వీకారం



సనత్‌కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

గూడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గూడూరు ఇన్‌చార్జి డిప్యూటీ ఈవోగా ఎంఈవో సనత్‌కుమార్ స్థానిక జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలోని డిప్యూటీ ఈవోగా కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జి డిప్యూటీ ఈవోగా ఉన్న శాంతికుమారి నాయుడుపేటకు బదిలీ కావడంతో ఆమె స్థానంలో సనత్‌కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. ఆయనకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే

రెవెన్యూ సదస్సులు: జేసీ



వెంకటరెడ్డిపల్లి రెవెన్యూ సదస్సులో జేసీ శుభం బన్సల్, సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా

బాలాయపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) భూసమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతోందని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అన్నారు. శుక్రవారం బాలాయపల్లి మండలంలోని అలిమిలి, వెంకటరెడ్డిపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. వెంకటరెడ్డిపల్లిలో జరిగిన సదస్సులో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా పాల్గొని రైతుల నుంచి వినతులు స్వీకరించారు. భూ సమస్యలపై 42, ఇళ్ల స్థలాల కోసం 20వినతులు వచ్చాయి. అనంతరం జేసీ మాట్లాడుతూ రైతుల భూ సమస్యలు పరిష్కరించుకునేందుకు ఇదొక మంచి అవకాశం అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివా సులు, ఆర్ఐ శ్రీకాంత్, సర్వేయర్ తారకరామారావు, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, పార్లపల్లి రఘునాథరెడ్డి, దాసరి రాజగోపాల్ నాయుడు, దాసరి ప్రభాకర్ నాయుడు పాల్గొన్నారు.

వాచ్‌మెన్‌పై ఆకతాయిల దాడి

కోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వాచ్‌మెన్ కోటయ్యపై ఆకతాయిలు రాళ్లతో దాడి చేసినట్లు శుక్రవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువారం రాత్రి విధుల్లో ఉండగా ఆకతాయిలు రాళ్లతో దాడి చేయడంతో గాయాలయ్యాయని కోటయ్య ఫిర్యాదులో పేర్కొన్నాడు. విచారించి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

రామాలయంలో చోరీ

గూడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదపల్లి గ్రామంలో గల కోదండరామాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం చోరీ జరిగినట్లు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ ఇన్‌చార్జి ఎస్ఐ సుబ్రహ్మణ్యంరాజు వివరాల మేరకు... గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఈదపల్లిలోని కోదండరామాంజనేయస్వామి తలుపును పగలగొట్టి లోనికి ప్రవేశించారు. స్వామి, అమ్మవార్లకు చెందిన 12 గ్రాముల బంగారం, రెండున్నర కేజీ వెండి ఆభరణాలను, వస్తువులను, ఆలయ ఆవరణలోని హుండీని పగలగొట్టి అందులోని నగదును అపహరించుకుని వెళ్లారు. చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సుబ్రహ్మణ్యంరాజు పరిశీలించారు. క్లూస్‌టీంను పిలిపించి వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పీఎం ఫసల్ బీమా యోజనను సద్వినియోగం చేసుకోండి

ఓజిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పీఎం ఫసల్ బీమా యోజనను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో విజయలక్ష్మి కోరారు. ఓజిలిలోని రైతు సేవా కేంద్రంలో శుక్రవారం ఫసల్ బీమా యోజన, ఈ-క్రాప్ నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఈనెల 31లోపు వరి పంటకు ఎకరానికి రూ.630, ఇతర పంటలకు ఎకరానికి రూ.650 ఈనెల 15లోపు చెల్లించి తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ కోర్డినేటర్ పసల సురేష్, రైతులు పాల్గొన్నారు.



వెంకటగిరి అభివృద్ధికి గత ప్రభుత్వం సహకరించలేదు: ఆనం



మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం సహకరించకపోవడం వల్లే వెంకటగిరి నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేకపోయానని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంకటగిరిలో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి ప్రారంభించారు. ఎంపీపీ తంబిరెడ్డి తనూజారెడ్డిని ఆమె చాంబర్‌లోకి తీసుకెళ్లి కూర్చొబెట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్లు ఎమ్మెల్యేగా తాను వెంకటగిరి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేయాలని భావించానని, అయితే గత ప్రభుత్వం సహకరించలేదన్నారు. తాను రూ.కోటి ఎంపీ నిధులు తీసుకువస్తే అభివృద్ధి పనులు చేపట్టనియ్యకుండా అడ్డుకున్నారని విమర్శించారు. రోడ్ల నిర్మాణానికి నిధులు తీసుకువచ్చి పనులు చేయమంటే కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు జరగలేదన్నారు. ఏ ప్రాంతం ఏ జిల్లాలో ఉందో తెలుసుకొనే లోపే ఐదేళ్లు ముగిశాయని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ దుర్మాగ పాలన వల్ల రాష్ట్రం ఎంతో నష్టపోయిందని చెప్పారు. ప్రజలు కోరుకొన్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి ఈ ప్రాంత అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సుభం బన్‌సల్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జడ్పీ సీఈవో రమ, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడలు ప్రసన్న, మున్సిపల్ చైర్‌పర్సన్ నాక్కా భానుప్రియ, టీడీపీ రూరల్ అధ్యక్షుడు పప్పు చంద్రమౌళిరెడ్డి, తంబిరెడ్డి శివారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భూములకు రక్షణ కల్పించేందుకే రెవెన్యూ సదస్సులు: పాశం



చిల్లకూరు మండలం ఓడూరు సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ - సూళ్లూరుపేటలో ప్రజల నుంచి అర్జీలు తీసుకొంటున్న ఎమ్మెల్యే, పక్కనే ఆర్డీవో కిరణ్మయి

చిల్లకూరు, సూళ్లూరుపేట, డక్కిలి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజల భూములకు రక్షణ కల్పించడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతోందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం చిల్లకూరు మండలంలోని ఓడూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ యాక్టును ప్రవేశపెట్టి పేదల భూములకు రక్షణ లేకుండా చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదల భూములకు రక్షణ కల్పించేందుకు ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేసిందన్నారు. ఎవరైనా పేదల భూములను ఆక్రమిస్తే కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ ద్వారా శిక్షించడం జరుగుతుందన్నారు. అధికారులు రెవెన్యూ సదస్సులను మొక్కుబడిగా కాకుండా ప్రజల సమస్యలను పరిష్కరించేలా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలన్నారు. రెవెన్యూ సదస్సులకు రాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని తహసీల్దారుకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, గుండాల లీలావతి, చిట్టేటి కీరవాణి, దాసరి శైలజ, కోటేశ్వరరాజు, యదనపర్తి భాస్కర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు. ● సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని వట్రపాలెం, పడమటి కండ్రిగ, నూకలపాలెం గ్రామానికి సంబంధించి మన్నారుపోలూరు సచివాలయంలో ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు. ● డక్కిలి మండలం నాగవోలులో జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను స్వీకరించారు. వాటిని పరిశీలించి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలను సైతం భయభ్రాంతులను చేస్తూ రాష్ట్రంలో వైసీపీ నేతలు వేల ఎకరాలను కాబ్జా చేశారని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు కోట్ల రూపాయలు విలువచేసే రెవెన్యూ, చెరువు పోరంబోకు, కాలువ పోరంబోకు భూములను సైతం వదలకుండా ఆక్రమించుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, సర్వేయర్ రాజగోపాల్, అంగన్‌వాడీ ప్రాజెక్టు అధికారిణి సంషాద్ బేగం, వీఆర్వో విజయకుమార్, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, టీడీపీ అధికార ప్రతినిధి ఆరికట్ల శ్రీరామ చౌదరి, తెలుగుయువత నాయకుడు వేముల కిషోర్ నాయుడు, స్థానిక నాయకులు తిరుపాల్, గడ్డం చంద్రశేఖరరెడ్డి. రంగినేని రాజా, మునికృష్ణయ్య, పోకూరు రమేష్, ఆలూరు దామోదర నాయుడు, యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఏపీ పాఠశాలకు ఎక్స్‌లెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీకాంత్‌రెడ్డి

గూడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణం శారద నగర్‌లోని ఎల్ఏపీ పాఠశాలకు ట్రైల్ బ్లజర్ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించినట్లు కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. తమ పాఠశాలలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో హైదరాబాదులోని ఈటీ టెక్ ఎక్స్‌ట్రైల్ బ్లజర్ సంస్థ అవార్డును అందజేసినట్లు తెలిపారు. శుక్రవారం హైదరాబాదులో టెక్ ఎక్స్‌ట్రైల్ సంస్థ చైర్మన్ బ్రహ్మం చేతులమీదుగా అవార్డు అందుకున్నట్లు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

ఆదర్శనీయుడు అంబేడ్కర్

గూడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆర్థిక, సామాజిక అసమానతలను రూపుమాపేందుకు ఎంతో కృషి చేసిన అంబేడ్కర్ ఆదర్శనీయుడని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక అశోక్‌నగర్‌లోని నీళ్లట్యాంకు సమీపంలో గల ఆయన విగ్రహానికి అంబేడ్కర్ సేవాసంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, వసంత్‌కుమార్, చెంచునారాయణ, ప్రభాకర్, ప్రతాప్, చిరంజీవి, వెంకటేశ్వర్లు, అనిల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి జనసేన నాయకుల ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

బాలాయపల్లి(ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి న్యాయవాదులు పెట్లూరు రాంప్రసాద్, పెట్లూరు కమలాకర్, కనుసూరు నాగయ్య, తలారి కోటేశ్వరరావు, పరమాల వెంకటేశ్వర్లు తదితరులు పూల మాల వేసి నివాళులర్పించారు.

ఓజిలి(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలపూడి, చిల్లమానుచేను, పెద్దపరియ గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు.

సూళ్లూరుపేట (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఏజీ కిషోర్, అలవల శ్రీనివాసులు, కుదిరి పెంచలయ్య, రాము, దంతాల రవి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి బొల్లకాయల విజయభాస్కర్, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి నివాళులర్పించారు. మేనకూరులో సీడీసీ మాజీ చైర్మన్ కట్టా సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఫజులుల్లా తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సెల్వం ప్రమాణస్వీకారం

తడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కొలవి సెల్వం శుక్రవారం విజయవాడలో ప్రమాణస్వీకారం చేశారు. సూళ్లూరుపేట నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు నెలవల రాజేష్, బొమ్మన శ్రీధర్, సుదర్శన్ మొదలియార్, బొమ్మన పళణి, ఆకుతోట రమేష్, జయపాల్, శ్రీనివాసులునాయుడు తదితరులు సెల్వంను శాలువాలు, పూలమాలలతో సత్కరించి అభినందించారు.



సెల్వంను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

రెవెన్యూలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 6,(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మండలం పెట్లూరులో శుక్రవారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు. ప్రజలకు తమ సమస్యలపై వచ్చేవారికి పరిష్కారం చూపించాలన్నారు. తహసీల్దార్ రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

పెళ్లకూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలచ్చూరులో తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతులు అందించిన అర్జీలను స్వీకరించారు. ఆర్ఐ సంతోషిబాయి, సర్వేయర్లు పూజిత, సూర్యనారాయణ, లక్ష్మణ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఓజిలి(ఆంధ్రజ్యోతి): తహసీల్దారు పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సులో 16 అర్జీలు అందాయి. భూముల సర్వే 6, పట్టాదారు పాసుపుస్తకాల కోసం 6, అసైన్‌మెంటు భూముల కోసం 4 అర్జీలు వచ్చాయి.

తడ(ఆంధ్రజ్యోతి): తడ మండలం కాశింగాడుకండ్రిగ గ్రామంలో తహసీల్దారు శరత్‌బాబు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. గ్రామస్తులనుంచి 15 అర్జీలు రాగా, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని తహసీల్దారు తెలిపారు.

చిట్టమూరు(ఆంధ్రజ్యోతి): మెట్టు గ్రామంలో తహసీల్దారు ప్రసాద్ రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎంపీడీవో మనోహర్ గౌడ్, రీసర్వే డీటీ నిరంజన్ కుమార్, సర్వేయర్ వెంకటేష్ పాల్గొన్నారు.


నాయుడుపేట టౌన్(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగమాంబపురం, పండ్లూరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దారు రాజేంద్ర రైతుల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించారు.

వాకాడు(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరు సచివాలయం పరిధిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 102 అర్జీలు వచ్చాయని తహసీల్దారు రామయ్య తెలిపారు. ఎంపీడీవో అన్నపూర్ణరావు, డీటీ సందీప్, ఆర్ఐ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు అర్బన్(ఆంధ్రజ్యోతి): మండలంలోని పారిచెర్ల, నెల్లటూరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. తహసీల్దారు చంద్రశేఖర్ ప్రజలన నుంచి అర్జీలను స్వీకరించారు.

కోట(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మద్దాలిలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. భూసమస్యలపై 5, ఇంటి స్థలాలు, ఇతర సమస్యలపై 45 అర్జీలు వచ్చాయని తహసీల్దారు జయజయరావు తెలిపారు. డిప్యూటీ తహసీల్దారు అజమతుల్లా, ఆర్ఐ మధులత పాల్గొన్నారు.

ఇళ్లపై విద్యుత్ తీగలు మార్చేందుకు చర్యలు



స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న విద్యుత్‌శాఖ డీఈ ప్రసాద్, తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి

గూడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇళ్లపై నుంచి వెళుతున్న విద్యుత్‌లైన్లను ఇతర ప్రాంతాల్లోకి మార్చేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి చెప్పారు. శుక్రవారం మండలంలోని చెన్నూరులో గల హరిజనవాడలో విద్యుత్ శాఖ అధికారులతో కలిసి గృహాలపై వెళుతున్న విద్యుత్‌లైన్లను పరిశీలించి స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెన్నూరులోని హరిజనవాడలో నివాసగృహాలపై విద్యుత్‌లైన్లు వెళుతుండడంతో ప్రమాదకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 85 మంది ఎంపిక

వెంకటగిరి టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 85మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఉమారాణి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది రామరావు, హరికృష్ణ, సునీల్, దశయ్య, పెంచలయ్య, కుమార్ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

నాయుడుపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా లభిస్తుందని ఆ పార్టీ తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి బీరదవాడ నారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి నానాబాల సుబ్బారావు అన్నారు. శుక్రవారం నాయుడుపేట మున్సిపాలిటీ పరిధి లోని జువ్వలపాళెంలో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు.